APTEL/2008/28200

## అన్నదాత పట్ల ప్రభుత్వంది వంచన

హైదరాబాద్ : మాజీ మంత్రి ,ఎమ్మెల్యే టి .హరీష్ రావు , ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ,ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు మాట్లాడుతూ ఈ ప్రెస్ మీట్ బాధతో ,దుఃఖం తో పెట్టాల్సి వస్తోంది. అన్నదాత పట్ల ప్రభుత్వంది వంచన. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలన రైతుల పట్ల యమపాశంగా మారింది. మేడ్చల్ లో వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు లేఖ రాసి మరీ సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. సురేందర్ రెడ్డి కి గ్రామీణ బ్యాంక్ లో అప్పు ఉంది. సురేందర్ రెడ్డి అమ్మకు లక్షా 15 వేలు ,సురేందర్ రెడ్డి కి లక్షా 92 వేలు అప్పు ఉంది. బ్యాంకు మేనేజర్ అనిరుద్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరికే రుణమాఫీ అవుతుందని చెప్పడం తో సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. సురేందర్ రెడ్డి ఆత్మహత్య లేఖ లోని ప్రతి అక్షరం రేవంత్ రెడ్డి ని నగ్న స్వరూపాన్ని బయటపెట్టింది.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## ఇది కష్ట సమయం ప్రజలు ధైర్యంగా ఉండాలి

ఖమ్మం : ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆదేశాలతో మిమ్మల్ని కలవడానికి మిమ్మల్ని పరామర్శించి ఇక్కడ పరిస్థితుల్ని పరిశీలించడానికి వచ్చాను. రాకాసితండా ప్రజలు వరద కారణంగా సర్వస్వం కోల్పోయారు నిరాశ్రయులుగా మిగిలారు. పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి పొలాలన్నీ ఇసుక మేటలుగా గా మారాయి. ఈ కష్ట సమయంలో ఈ గ్రామస్తులకు అండగా నిలవలసిన అవసరం ఉంది గ్రామస్తులు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు . ప్రజల కోరిక మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరి ఆమోదం మేరకు రాకాసితండాను సురక్షిత ప్రాంతానికి మార్చే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పంట పొలాల్లో ఇసుక మేటను తొలగించి ఆర్థిక సాయం అందించి రైతులు సాగు చేసుకునే విధంగా చేయాలి.

సంపుటి: 16 సంచిక : 114 కరీంనగర్ మంగళవారం, సెప్టెంబరు 10, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

# నెల రోజుల్లో వైఖరి తేల్చండి

## స్పీకర్ కు సూచించిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. వారి అనర్హతపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అప్పటిలోగా నిర్ణయం తీసుకోకపోతే సుమోటోగా కేసు విచారిస్తామని తెలిపింది.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని బీఆర్ఎస్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ వేసింది. దానిపై విచారించిన ధర్మాసనం.. తాజా ఆదేశాలు జారీ చేసింది.ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఃఖీు నేత హరీష్ రావు అన్నారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న అప్రజాస్వామ్య విధానాలకు చెంపపెట్టని తెలిపారు. తెలంగాణ హైకోర్టు తీర్పుతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పడటం ఖాయమని హరీష్ రావు స్పష్టం చేశారు. అనర్హత కారణంగా ఉపఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో ఃఖీు గెలుపు తథ్యమని ఎక్స్ వేదికగా హరీష్ రావు తెలిపారు.తాము పార్టీ మారినప్పుడు పార్టీని విలీనం చేశామని, కాని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగింది పార్టీ ఫిరాయింపని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మూడు నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉపఎన్నికలు వస్తాయని తెలిపారు.అనర్హత పిటిషన్ల వ్యవహారంలో స్పీకర్‌కు ఇమ్యూనిటీ ఉండదని హైకోర్టులో ఃఖీు తరపున వాదనలు వినిపించిన ప్రముఖ న్యాయవాది గండ్ర మోహన్‌రావు అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన 24 గంటల్లోనే వారిపై అనర్హత వేటు వేసిన విషయాన్ని హైకోర్టు దృష్టికి తెచ్చినట్టు ఆయన తెలిపారు. హైకోర్టు ఆదేశాలను పాటిస్తూ నాలుగు వారాల్లోగా స్పీకర్ చర్యలు తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మణిపూర్ ఎమ్మెల్యేల కేసును కూడా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు హైకోర్టుకు వివరించారు. 142 ఆర్టికల్ కింద సుప్రీంకోర్టు స్పీకర్‌కు నోటీసులు జారీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇక్కడ పార్టీ మారడమే కాకుండా మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా పోటీ చేశారని దానం నాగేందర్ ఇష్యూను కోర్టుకు వివరించారు పిటిషనర్లు.స్పీకర్‌ను ఆదేశిస్తే రెండు వ్యవస్థల మధ్య ఘర్షణపూరిత వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం తరుపున న్యాయవాదులు వాదించారు. ఈ



కేసులో అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. దానం, కడియం తరపున శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, జంధ్యాల రవిశంకర్ కోర్టులో వాదించారు. పిటీషన్ల తరపున వాదను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా పరిగణలోకి తీసుకుంది. నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఎప్పుడు నోటీసులు ఇస్తారు... ఎప్పుడు విచారణకు పిలుస్తారు. ఎప్పటి నుంచి వాదనలు వింటారు... ఎప్పటి లోపు ప్రొసీడింగ్స్ పూర్తి చేస్తారో వివరంగా షెడ్యూల్ తెలియజేయాలని ఆదేశించింది హైకర్టు. నాలుగు వారాల్లో షెడ్యూల్ రిలీజ్ చేయకపోయినా నిర్ణయం ప్రకటించకున్నా తామే ఓ నిర్ణయం చెబుతామని పేర్కొంది హైకోర్టు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు తీర్పును బీఆర్ఎస్ స్వాగతించింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు కీలక కామెంట్స్ చేశారు.

## భారత్‌లోకి మంకీపాక్స్ ఎంట్రీ




సెప్టెంబర్ 9 : కొన్నేళ్ల క్రితం కరోనా మహమ్మారితో వణికిన ప్రపంచాన్ని మంకీపాక్స్ అనే వైరస్ చుట్టుముడుతోంది. ఇప్పటికే ఆఫ్రికా, యూరోపియన్ దేశాల్లో వ్యాపించిన ఈ వైరస్‌కు సంబంధించి సోమవారం తొలి కేసు నమోదైనట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్ట్ చేసింది. భారత్‌లో తొలి మంకీ పాక్స్ కేసు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఢిల్లీలో ఒకరికి వ్యాధి లక్షణాలను గుర్తించినట్లు పేర్కొంది. అతడిని పాజిటివ్‌గా నిర్ధారించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. పరీక్ష ఫలితాల్లో రోగిలో వెస్ట్ ఆఫ్రికన్ క్లాడ్ 2 వైరస్ ఉన్నట్లు గుర్తించామని చెప్పింది. అయితే ఈ ఏడాది మంకీ పాక్స్ సంబంధించి భారత్‌లో ఒక్క కేసు మాత్రమే నమోదైందని.. తొలిసారి దేశంలో 2022లో 30కిపైగా కేసులు వెలుగు చూశాయని అధికారులు తెలిపారు. ఈ కేసు.. 2022లో నమోదైన 30 కేసుల మాదిరిగానే అంత ప్రమాదకారి కాదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. క్లాడ్ 1 ఆరోగ్య అత్యవసర స్థితికి సంబంధించిన వైరస్ కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరించింది. అయితే ఇది సోకిన వ్యక్తి తీవ్రతను ఎదుర్కొంటున్న దేశం నుంచి ఇటీవల ప్రయాణించిన ఓ యువకుడని తెలిసింది. ప్రస్తుతం అతడిని ఐసోలేషన్‌లో ఉంచినట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందని.. ఆరోగ్య సమస్యలేవీ లేవని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది.

## 'మీ గొంతు తగ్గించుకోండి'

### చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ వార్నింగ్



ఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అభయ హత్యాచార ఘటనపై సోమవారం విచారించారు. ఈ క్రమంలో గట్టిగా వాదించిన ఓ లాయర్‌పై అసహనం వ్యక్తం చేశారు. గొంతు తగ్గించుకోవాలని ఆయనకు సూచించారు. జరిగిన తప్పుకు లాయర్.. చీఫ్ జస్టిస్‌ను క్షమాపణలు కోరారు. కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార కేసును జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఇవాళ విచారించింది. వాదనల సందర్భంగా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ.. ఆగస్టు 9న ప్రభుత్వ ఆధీనంలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో జరిగిన హత్యాచార ఘటన అనంతరం నిరసనకారులపై ఓ న్యాయవాది రాళ్లు రువ్వుతున్నట్లు నిరూపించే సాక్ష్యాలు తన దగ్గర ఉన్నాయని ధర్మాసనానికి చెప్పారు. కపిల్ సిబల్ వాదనల సమయంలో మరో న్యాయవాది కౌస్తవ్ భాగ్చి మాట్లాడుతూ.. ఓ సీనియర్ న్యాయవాది కోర్టులో అలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ.. కోర్టు బయట జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నారా అని భాగ్చిని ప్రశ్నించారు. గడిచిన రెండు గంటల నుంచి ఆయన్ని గమనిస్తున్నానన్నారు. గొంతును తగ్గించి మాట్లాడాలని హెచ్చరించారు. ముగ్గురు జడ్జీల ముందు మీరు మాట్లాడుతున్నారని, మీరేమి జనాలను ఉద్దేశించి మాట్లాడటం లేదని సీజే పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ వార్నింగ్‌తో లాయర్ కౌస్తవ్ భాగ్చి క్షమాపణలు చెప్పారు. అదే సమయంలో ఏడెనిమిది మంది న్యాయవాదులు ఒకేసారి వాదనలు వినిపిస్తుండటాన్ని ఆయన తప్పుబట్టారు. ఒకే సమయంలో అంత మంది వాదించడం సరికాదని సూచించారు. వచ్చే మంగళవారం లోపు వైద్యురాలి హత్యాచార ఘటనపై కొత్త రిపోర్టును సమర్పించాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నమూనాలను ధర్మాసనానికి పంపాలని సీబీఐ నిర్ణయించినట్లు సొలిసిటర్ జనరల్ మెహతా తెలిపారు. అత్యాచార ఘటన జరిగిన సమయం, వివరాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్ సీబీఐకి ఇచ్చారా లేదా అని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సీబీఐ ఫోరెన్సిక్ నివేదికను అందజేసిన తర్వాత కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. "శాంపిల్స్ ఎవరు సేకరించారు" అనేది ఈ కేసులో ముఖ్యమైన ప్రశ్న అని, అందుకే ఎవరు సేకరించారనే విషయం నిర్ధారణ అయిన తర్వాత వచ్చే తాజా రిపోర్ట్ దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది.

## తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం

### ఖాయం : సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



హైదరాబాద్ సెప్టెంబర్ 9 : ప్రజాస్వామ్యం పై నమ్మకం పెరిగేలా కోర్టు తీర్పు ఉంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాకోర్టులో కూడా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. వారిపై అనర్హత వేటు పడటం ఖాయమన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని పేర్కొన్నారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. ఇక హైడ్రా పేరుతో రేవంత్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నడు. హైదరాబాద్ అంటేనే భయపడేలా చేసిండు. చట్టప్రకారం కాకుండా అడ్డగోలుగా బొల్డోజర్లతో రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు.

## చేనేతలకు 30 కోట్ల రుణమాఫీ

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : చేనేత రుణభారం 30 కోట్ల రూపాయలను తీర్చేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధంగా ఉందన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. కుల, చేతి వృత్తులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులున్నారని, ఆయా సంఘాల మహిళలకు ఏటా రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.సోమవారం హైదరాబాద్ లలితా కళాతోరణంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని వర్చువల్‌గా ప్రారంభించారు ముఖ్యమంత్రి. ఈ సందర్భంగా చేనేత అభయహస్తం లోగోలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్.. ఒకప్పుడు తెలంగాణ విద్యార్థులు హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సు కోసం పొరుగునున్న ఏపీ, ఒడిషాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నా రు. గడిచిన ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉన్నా ఏ మాత్రం చర్యలు తీసుకోలేదన్నారు.ఈ అంశం మా దృష్టికి వచ్చిన వెంటనే కేంద్రం దృష్టికి తీసుకెళ్లామన్నారు సీఎం. కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ భూమి ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం కొందరు పదవులు వదులుకున్నారని, కానీ కొంతమంది రాజీనామా చేసిమళ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలు తెచ్చారని గుర్తు చేశారు.ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగం చేశామని చెప్పుకుంటున్నారని విమర్శించారు సీఎం రేవంత్. గజ్వేల్‌లో ఫామ్ హౌస్ లు ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. కొండా లక్షణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తుస్తుందని, ఐఐహెచ్‌టీకి ఆయన పేరు పెడతామన్నారు.వచ్చే ఏడాది నుంచి స్కిల్స్ యూనివర్సిటీలో ఐఐహెచ్‌టీ భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఆర్భాటం, సినీ తారల తళుకు బెళుకులు తప్పా, నేతన్న ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించకుండా ఆలస్యం చేసిందని, తాము బకాయిలు చెల్లించి.. రాజకీయాలకు అతీతంగా సిరిసిల్ల కార్మికులను ఆదుకున్నామని వెల్లడించారు.నేత కార్మికుల కళ్లలో ఆనందం చూసేందుకు రూ.290 కోట్ల బకాయిలు విడుదల చేశామన్నారు. రైతన్న ఎంత ముఖ్యమో.. నేతన్న కూడా మాకు అంతే ముఖ్యమన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఐఐహెచ్‌టీ విద్యార్థులకు నెలకు రూ. 2500 ప్రోత్సాహకం అందించారు ముఖ్యమంత్రి. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఆగని హైడ్రా దూకుడు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 : హైడ్రా.. జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నది. అక్రమార్కుల భరతం పడుతున్నది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను శరవేగంగా కూల్చివేస్తూ వెళ్లుతున్నది. హైదరాబాద్ ట్రైసిటీలోని పలు చెరువుల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను, షెడ్లను, లే ఔట్లను హైడ్రా ఆదివారం తొలగించింది. హైడ్రా విభాగం అధికారులు, స్థానిక రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పోలీసుల ఆధ్వర్యంలో ఈ తొలగింపులు జరిగాయి. ఈ నేపథ్యంలోనే అక్రమ కట్టడాలు, లే ఔట్లను తొలగించి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ కీలక వివరాలు పంచుకున్నారు.అదే విధంగా ఆయన పౌరులకు కీలక సూచనలు చేశారు. నగరవాసులు తమ సొంతింటి కలను సాకారం చేసుకునే క్రమంలో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు.. అవి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయా? లేవా? అనేది కచ్చితంగా నిర్దారించుకోవాలని, అవి ఏ చెరువుకు చెందిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో లేనట్టయితేనే కొనుగోలు చేయాలని సూచించారు.మాధాపూర్‌లోని సున్నం చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల, రెండు అంతస్తుల భవనాలను కూల్చివేశారు. 30కి పైగా షెడ్లను తొలగించి సుమారు పది ఎకరాల భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, దుండిగల్ కొత్వాల్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న పదకొండు డూప్లెక్స్ భవనాలను తొలగించిన అధికారులు రెండు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు.ఇదే సందర్భంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కొన్ని అంశాలపై స్పష్టత ఇచ్చారు. ప్రజలు నివాసముంటున్న కట్టడాలను తాము తొలగించబోమని, ఆ నివాసాలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ వాటిని కూల్చివేయబోమని స్పష్టం చేశారు. నివాసముంటున్న ఇళ్లను ఎట్టిపరిస్థితుల్లో కూల్చివేయబోమని హైదరాబాద్ ప్రజలకు తెలియజేస్తున్నామని, గందరగోళ పడొద్దని, భయాందోళనలు అక్కర్లేదని తెలిపారు. కొత్తగా చేపట్టే నిర్మాణాలను అడ్డుకుంటామని, ఇప్పటికే శాశ్వత నివాసాలుగా ఉన్న వాటికి సంబంధించి ప్రభుత్వం తెచ్చే పాలసీ ఆధారంగా నడుచుకుంటామని వివరించారు. ఈ రోజు మాధాపూర్ సున్నం చెరువు, దుండిగల్‌లోని మల్లంపేట్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అనుమతులు లేని.. నిర్మాణంలో ఉన్న కట్టడాలను తొలగించామని వివరించారు. ఇక అమీన్‌పూర్‌లో అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్స్, గదులు, షెడ్లు ఉన్నాయని, వాటిని తొలగించామని తెలిపారు.

## పాత భవనాల జోలికి పోం

హైదరాబాద్ : ఎఫ్టిఎల్ / బఫర్లో నిర్మించబడి, వ్యక్తులు ఆక్రమించినప్పటికీ, ఇల్లు/ నివాసం ఏదీ కూల్చివేయబడదు. అక్రమిత నివాసాలు/ నివాసాలు కూల్చివేయబడవని హైడ్రా వివరణ ఇచ్చింది. ఎఫ్టీఎల్ఒ/బఫర్లో వచ్చే కొత్త నిర్మాణాలు కూల్చివేయబడతాయి. మాదాపూర్ సున్నం చెరువు, దుండిగల్లోని మల్లంపేట్ చెరువులో ఈరోజు కూల్చివేసిన నిర్మాణాలు నిర్మాణంలో ఉన్నాయి మరియు ఎఫ్టిఎల్ / బఫర్ జోన్లలో అనుమతి లేకుండా వస్తున్నాయి. అమీన్పూర్లో కూల్చివేసిన నిర్మాణాలు ప్రధానంగా కాంపౌండ్ గోడలు/ గదులు/ షెడ్లు ఆక్రమణకు గురయ్యాయి. సున్నం చెరువులో నిర్మించిన కొన్ని షెడ్లు/హోటల్ను వాణిజ్యపరంగా వినియోగించి ఎఫ్టీఎల్లో పడి.. కూల్చివేశారు. ఏ వ్యక్తి ఆక్రమించిన ఇల్లు/నివాసం కూల్చివేయబడదు. – మల్లంపేట చెరువు, దుండిగల్లో కూల్చిన 7 విల్లాలు ఇప్పటికీ నిర్మాణంలో ఉన్నాయి (ఏ కుటుంబాలు ఆక్రమించలేదు) మరియు భవన నిర్మాణ అనుమతులు లేకుండా ఎప్టిఎల్లో ఉన్నాయి.

# తెలంగాణ నుండి ఫోకస్

తెలుగు దినపత్రిక

మంగళవారం, సెప్టెంబరు 10, 2024


## గ్రిగ్ వర్కర్లుగా నిరుద్యోగులు జీవనం

పాలకుల ప్రకటనకు చేపట్టే విధానాలకు పొంతన లేకుండా పోయింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయకుండా ఉద్యోగ కల్పన పేరుతో ప్రైవేటు పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు నిరుద్యోగుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సబ్సిడీలు ఇస్తే ఉద్యోగ కల్పన సాధ్యమా? పెట్టుబడిదారుల మూలధన సాంద్రత (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్) ప్రాతిపదికన ఉత్పత్తి కార్యక్రమాలు చేపట్టడం వలన నిరుద్యోగ సమస్య తీరదు. శ్రమ సాంద్రత, ఉత్పత్తి పద్ధతులకు వాళ్లు ఎప్పుడో మంగళం పాడారనే విషయం పాలకులకు తెలియదా1991 నుంచి సరళికుత ఆర్థిక విధానాలు (లిబరలైజేషన్ ప్రైవేటైజేషన్ గ్లోబలైజేషన్)చేపట్టిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ పరం చేయడం జరుగుతున్నది. 2013లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 17.3 లక్షల ఉద్యోగాలు ఉండగా 2022 నాటికి ఉద్యోగాలు 10 లక్షలకు తగ్గిపోయాయి. అందులోనూ కాంట్రాక్టు కార్మికులుగా 43% మందికి నియామకాలు జరిగాయి. ఇలా దేశంలో మెల్లగా ప్రైవేటు రంగం విస్తరించి కార్పొరేట్ రంగానికి పునాదులు బలంగా ఏర్పడడంతో ఉద్యోగ కల్పన లేక నిరుద్యోగులు గ్రిగ్ వర్కర్లుగా జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.అభివృద్ధి అంటే అందరి వృద్ధి అంతేగాని కొందరి వృద్ధి కాదని గాంధీజీ అన్నారు. దేశ ఆదాయం ఎంత అనేది ముఖ్యం కాదు. ప్రజలకు కనీస అవసరాలైన తిండి, వసతి, విద్యా, వైద్యం ఏ మేరకు జరుగుతున్నది అనేది ముఖ్యం. దేశ ప్రజల స్వయం పోషకత్వం ఉద్యోగ కల్పనతోనే సాధ్యం.ఒక దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో నిర్ణయించడంలో కీలక అంశం నిరుద్యోగం. ఉత్పత్తి కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొంటే ఆదాయాలు పెరిగి వస్తు సేవలకు గిరాకీ ఏర్పడి వస్తు సేవల ఉత్పత్తి అవసరం ఇంకా పెరిగి ఉద్యోగ కల్పన జరిగే అవకాశాలు మెరుగవుతాయి. తద్వారా ప్రజల ఆదాయాలు, దేశ ఆదాయం పెరిగి ఆర్థిక వ్యవస్థ స్థాయి ఐదవదా, నాలుగవదా అనేది నిర్ణయింపబడుతుంది. అంతేగాని దేశంలో పేదరికం, నిరుద్యోగిత విపరీతంగా ఉండి ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదైనా ఏమి ప్రయోజనం.2047 కల్లా దేశాన్ని ప్రపంచంలోనే వృద్ధి రీత్యా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చాలి అనుకుంటున్నారు పాలకులు. ఉద్యోగరీత్యా మాత్రం కాదు. 2014లో మన ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పుడు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు మరలా ఉద్యోగ కల్పన కోసం, వివిధ పథకాల నిర్వహణ కోసం రెండు లక్షల కోట్లు కేటాయించి 4.1 కోట్ల మందికి ఉద్యోగ కల్పన చేస్తానని అంటున్నారు. కానీ మొదటి ఎనిమిది సంవత్సరాల కాలంలో 7.2 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని లోక్‌సభలో మినిస్ట్రీ ఆఫ్ పర్సనల్ అఫైర్స్ తెలియజేసినారు.నిరుద్యోగిత సమస్య లేనే లేదు. దేశంలో నిరుద్యోగిత 3.2 శాతానికి తగ్గిపోయినట్లు పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించిందని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. 2014-23 సంవత్సరాల మధ్యకాలంలో కోటి 25 లక్షల ఉద్యోగాలను సృష్టించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధక విభాగం నివేదిక వెల్లడించిందని ఆర్థిక మంత్రి తెలిపారు. అవి రెండు ప్రభుత్వ నివేదికలే. కానీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఏకానమీ (సిఎంఐ) ఈ డేటా ఆ నివేదికల వివరాలకు విరుద్ధంగా ఉన్నది. దేశంలో నిరుద్యోగిత ప్రస్తుతం 9.2%గా ఉన్నదని ఆ ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థ పేర్కొంది. భారత్‌లో నిరుద్యోగులుగా ఉన్నవారిలో 83 శాతం మంది యువజనులేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ ఐఎల్ఓ వెల్లడించింది.ఉద్యోగ అవకాశాలు పెరిగిపోతున్నాయని ఒక వైపు చెబుతూనే కోట్ల కోట్లకు నిరుద్యోగులు ఉన్నారని చెప్పడం పాలకుల మాటల చాతుర్యమే కదా? ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ అనుబంధంగా ఉన్న అంతర్జాతీయ శ్రామిక సంస్థ ప్రకారం మనదేశంలో నిరు ద్యోగం ముఖ్యంగా యువతలో నిరుద్యోగం బలంగా ఉందని చెప్పడం చూస్తుంటే పాలకులు చెప్పే మాటలకు అధికారిక గణాంక వివరాలు తెలియజేసే సంస్థలకు పొంతన లేకుండా పోయింది. రాజకీయ లెక్కలే గాని అధికారిక సంఖ్యాపరమైన సమాచారం నిరుద్యోగంపై ప్రభుత్వాల దృష్టి పెట్టకపోవడం ఎందుకు?ఉద్యోగాల కల్పన విషయంలో భారత్ జి20 సభ్య దేశాలన్నిటికంటే వెనుకబడిందని అంతర్జాతీయ ద్రవ్యనిధి ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీత గోపీనాథ్ అన్నారు. దేశంలో 2030 నాటికి 14.8 కోట్ల అదనపు ఉద్యోగ కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. 2010లో ప్రారంభమైన దశాబ్దం లో భారత సగటున 6.6% శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేయగా ఈ కాలానికి ఉద్యోగాల కల్పన రేటు మాత్రం రెండు శాతానికి పరిమితమైంది. జి20లోని ఇతర దేశాలతో పోలిస్తే భారత ఉద్యోగాల కల్పన చాలా తక్కువగా ఉంది. అయితే మన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రచురించిన కేఎల్ఈఎంఎస్ డేటా ప్రకారం మనదేశంలో 2017-18లో 47.5 కోట్ల ఉద్యోగాల నుండి 2023-24లో 64.33 కోట్ల సంఖ్యకు ఉద్యోగులు పెరిగారని మరొకవైపు చెబుతున్నారు. ఆర్థిక శాస్త్రవేత్తలు దీన్ని ఖండించారు. కరోనా కాలంలో వలస కూలీలందరూ తమ ఊర్లకు వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేయడం కూడా ఉద్యోగ కల్పన జరిగినట్లుగా భావించి 2017-18లో 47.5 కోట్లు నుంచి 2023- 24 నాటికి 64.33 కోట్లకు పెరిగింది అని చెప్పడం ఏ కొలబద్ద ప్రకారమనీ, అది ఉద్యోగిత కాదని, గత్యంతరం లేని బతుకుతెరువు మాత్రమేనని అంటున్నారు. 2010-20 మధ్య కాలంలో దేశంలో వృద్ధిరేటు 6.6% మాత్రమే ఉండగా ఉద్యోగ కల్పన రేటు 2 శాతం మాత్రమే నమోదయింది. ఇటువంటి పరిస్థితులలో ఇన్ని కోట్ల మందికి ఉద్యోగ కల్పన ఎలా జరిగిందనేది సందేహమే.

## అవినీతి తుప్పు వదులుతోంది




మిర్యాలగూడ, సెప్టెంబరు 9 : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని థర్మల్‌ప్లాంట్‌లో కొంత కాలంగా ఇనుము, అల్యూమినియం, ఇతర తుప్పు సామగ్రి గుట్టుగా బయటకు వస్తోంది. ఈ వ్యవహారంలో కాంట్రాక్టు సంస్థలో పనిచేసే ఉద్యోగులు, ఇంజనీర్లు సహకరించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీంతో రెండు నెలల క్రితం వాడపల్లి పోలీసులు 10 మందిని అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లు మొదలవడంతో పోలీసుల విచారణ అర్ధంతరంగా నిలిచింది. అనుమానాస్పదంగా పోలీసులకు చిక్కిన వ్యక్తులను పూర్తిస్థాయిలో విచారించకుండా నామినల్ కేసులు నమోదు చేసి విడుదల చేశారు. అయితే స్క్రాప్ మాయం చేయడంలో గోదాం వద్ద విధులు నిర్వహించే ఓ అధికారి ప్రమే యం ఉన్నట్లుగా అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. మిర్యాలగూడ, హైదరాబాద్‌కు చెందిన బడా వ్యాపారులతో కొందరు చేతులు కలిపి దొడ్డి దారిన కాజేసి స్క్రాప్‌ను అక్కడకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా కొందరు వ్యక్తులు అనూహ్యరీతిలో ఆర్థికంగా నిలదొక్కుకొని ట్రాన్స్‌పోర్టు వాహనాలను కొలుగోలు చేసినట్లుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా మరోసారి స్క్రాప్ మాయం కావడంపై పోలీసులకు ఉప్పందినట్లుగా తెలుస్తోంది. దీంతో కొన్నాళ్లుగా యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ స్క్రాప్ కాజేస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసు బృందాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. మిర్యాలగూడ పట్టణంలో స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నుంచి అక్రమంగా తరలివస్తున్న స్క్రాప్‌ను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్న ప్రచారం జరుగుతోంది. తుప్పును తస్కరించి తీసుకువస్తున్న కొందరు వ్యక్తులతో పెరిగిన పరిచయాలు, ఈ దందాతో వస్తున్న లాభాలను పరిగణించిన సదరు వ్యాపారి ఇటీవల పట్ట ణ శివారులో ఓ స్క్రాప్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న తన వ్యాపార కేంద్రంలో కొనుగోళ్లు చేస్తే ఎక్కడ దొరికిపోతానోనని జాగ్రత్తపడి రాకపోకలకు అనువుగా ఉండే చోట కొత్త వ్యాపార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్క్రాప్ చోరీ ముఠాకు థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డుల సహకారం ఏ మేరకు ఉందన్న కోణంలో అధికారులు లోతైన విచారణ కొనసాగుతోంది. యాదాద్రి థర్మల్‌పవర్‌ప్లాంట్‌లో కొంతకాలంగా చోరీకి గురవుతున్న స్క్రాప్ వ్యవహారం ఓ కొలిక్కి వస్తున్నట్లుగా తెలుస్తోంది.

## మేడారం ఘోర విపత్తుపై ఎన్ఆర్ఎస్సీ విచారణ



వరంగల్, సెప్టెంబర్ 9: ములుగు జిల్లా మేడారం అడవుల్లో ఘోర విపత్తుపై ఎన్ఆర్ఎస్సీ, వాతావరణ శాఖ విచారణ చేపట్టింది. అడవుల్లో వాతావరణ పరిస్థితులను ఎన్ఆర్ఎస్సీ నమోదు చేసుకుంది. 2018 జనవరి 22న మేడారంలోని చిలకల గుట్టలో టోర్నడోలాంటి సుడిగాలి బీభత్సం సృష్టించింది. ఆనాడు సుడిగాలి ఫోటోలను ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ వీరగోని హరీష్ క్యాప్చర్ చేశారు. మేడారంలో అడవుల్లో టోర్నడోలా బీభత్సం వల్లే అడవులు ధ్వంసమైనట్టు అధికారులు నిర్ధారణకు వస్తున్నారు. అలాగే మేడారం అడవుల్లో ఘోర విపత్తుపై ప్రభుత్వానికి అటవీ రక్షణ ప్రధానాధికారి డోబ్రియాల్ని రెండు రోజుల క్రితం నివేదిక ఇచ్చారు. క్లౌడ్ బరస్ట్ వల్లే ఈ విపత్తు సంభవించిందని... మేఘాలు కిందకు వచ్చి బరస్ట్ కావడంతోనే చెట్లు నేలకూలాయని తెలిపారు. 3 కిలోమీటర్ల పొడవు, 2 కిలో మీటర్ల వెడల్పులో 204 హెక్టార్లలో 50వేల చెట్లు కూలాయన్నారు. క్లౌడ్ బరస్ట్ ఎందుకు జరిగిందో తెలుసుకోవాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ తెలియజేశామన్నారు. కూలిన చెట్లను వారంలోగా డిపోలకు తరలిస్తామన్నారు.

# చిత్తశుద్ధి లేని 'శివ' పూజలేల?



దైవీకరణ రాజకీయాల (నాయకులను దైవసమానంగా ఆరాధించడం)లో దైవాంశ సంభూతులు ఉంటారు. మన మధ్య ఉన్నా లేదా కీర్తిశేషులు అయినా వారిని పల్లెత్తు మాట అనడానికి వీలులేదు. మరి ఆ నేతల స్మృతికి అపచారం జరిగితే సహించడమనే ప్రసక్తే లేదు. మన సువిశాల భారతదేశంలో ప్రతి రాష్ట్రంలోను ఆ బాల గోపాలం ఆరాధనకు పాత్రులవుతున్న మహాపురుషులు ఉన్నారు. ఎన్నటికీ వారి కీర్తికాంతులు మసకబారవుబీ యశోతేజస్సు వెలవెలబోదు. మహారాష్ట్ర అంటే మనకు గుర్తుకువచ్చేదెవరు? ఛత్రపతి శివాజీ. అవును, ఆయన మహారాష్ట్రీయుల మహోన్నత ఆరాధ్యవీరుడు. పరిపాలకుడుగా సైతం ఆయన వారికి ప్రాతఃస్మరణీయుడు. సరే, నేనూ నా సొంత శివాజీ మహరాజ్ పాఠం నేర్చుకున్నాను. అది 1990ల నాటి మాట. ముంబై విమానాశ్రయానికి పునఃనామకరణం విషయమై ప్రజల్లో తర్జన భర్జనలు జరుగుతున్న సందర్భమది. భారత పౌర విమానయాన చరిత్ర పథనిర్దేశకుడు అయిన జెఆర్‌డి టాటాకు ఆ గౌరవం దక్కాలని నేను నా కాలమ్‌లో నొక్కి చెప్పాను. వెన్వెంటనే శివసేన నాపై విరుచుకుపడింది. ఆ పార్టీ అధికార పత్రిక నా ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఒక ఆగ్రహపూరిత సంపాదకీయం రాసింది. ముంబై విమానాశ్రయానికి మరాఠా విప్లవవీరుడి పేరిటే పునఃనామకరణం చేయాలని, ఆ గౌరవానికి మరెవ్వరి పేరునైనా పరిశీలించడం సైతం శివాజీ స్మృతికి అపచారం చేయడమే అవుతుందని తెగేసి చెప్పింది. నేను రాసిన వ్యాసాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవలసివస్తుందని బెదిరిస్తూ మా కార్యాలయానికి ఫోన్ కాల్స్ వచ్చాయి. మూడు దశాబ్దాల నాడు నేను నేర్చుకున్న పాఠం నేడు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని వెన్నాడుతోంది, ఇబ్బంది పెడుతోంది, చికాకుపరుస్తోంది. సింధు దుర్గ్‌లో కొత్తగా ప్రతిష్ఠించిన శివాజీ మహరాజ్ విగ్రహం ఇటీవల కూలి పోయింది. ప్రజలు కలతచెందారు. భావోద్రేకం బద్దలయింది. రాజకీయులు, ఊహించిన విధంగానే ప్రతిస్పందించారు. పాలక, ప్రతిపక్ష నేతలు పరస్పరం నిందించుకున్నారు. వాగ్యుద్ధాలకు దిగారు. శివాజీ విగ్రహం ఎందుకు కూలింది? మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఆ పాపాన్ని భారత నావికాదళానికి అంటగట్టడానికి ప్రయత్నించింది. అయితే మరింత నష్టం జరగకముందే నేవీపై తన అభియోగాన్ని ఉపసంహరించుకున్నది. శివాజీ ప్రతిమ కూలిన చోటే మరో బృహత్ శివాజీ విగ్రహాన్ని నెలకొల్పుతామని ప్రజలకు వాగ్దానం చేసింది. విపక్షాలు సంయమనం పాటిస్తాయా? నిరసన ప్రదర్శనలను కొనసాగించాయి. విగ్రహ నిర్మాణంలో ప్రభుత్వం అవినీతికి పాల్పడడం వల్లే ఆ ప్రతిమా భంగం సంభవించిందని ఆరోపించాయి. మరి అసెంబ్లీ ఎన్నికలు ఆసన్నమైన తరుణమిది. కనుక విగ్రహ పతనం రాజకీయీకరణ కావడం అనివార్యం. ఈ భావోద్వేగ అంశం కాకపోతే మరేది రాజకీయ ప్రయోజనాలకు తోడ్పడుతుంది కనుక? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2002 గుజరాత్ ఊచకోతల నాటి నుంచి నేటి దాకా ఎప్పుడైనా బహిరంగంగా క్షమాపణలు చెప్పడం మీరు విన్నారా? కన్నారా? సింధ్ దుర్గ్‌లో శివాజీ విగ్రహం కూలిపోయిన వైనంతో ఆయనకు మరో గత్యంతరం లేకపోయింది. ఆ సంఘటనపై ఆయన బహిరంగంగా విచారం వ్యక్తం చేశారు. అవును మరి, పోయిన డిసెంబర్‌లోనే కదా మహా ఆర్భాటాల మధ్య ఆయన ఆ బృహత్ విగ్రహాన్ని ఆవిష్కరించింది! అసలు ఆ శిలా శివాజీని తొలుత 6 అడుగుల నిడివిలో ఉంచాలని ఉద్దేశించారు. అయితే ఆకస్మికంగా అది 35 అడుగుల విగ్రహంగా రూపుదాల్చింది. ఆ బృహత్ విగ్రహ నిర్మాణానికి సరైన సామగ్రి ఉపయోగించారా? దర్యాప్తు జరిగితీరవలసిన విషయమిది. విగ్రహ నిర్మాణం వేగంగా జరిగింది. ఎందుకు? జాతీయ నాయకత్వాన్ని ఆకట్టుకోవాలనే ఆరాటమే సుమా! ఈ హడావుడిలో నిర్మాణ కార్యక్రమంపై సరైన పర్యవేక్షణను ఉపేక్షించారు. అవినీతి జరిగిందా? ప్రశ్న అనవసరం. సరైన దర్యాప్తే అసలు బాగోతాన్ని వెల్లడించగలదు. పరస్పర ఆరోపణలు, అభిశంసనల ఆవలకు దృష్టి సారించండి. మహా శక్తిమంతుడు అయిన మొగల్ చక్రవర్తిని ఎదిరించి నిలిచిన ఆ మహానాయకుడి శిలావిగ్రహం మట్టి బొమ్మలా కూలిపోయిన వైనంపై నిశితంగా ఆలోచించండి. మన పరిపాలనా పద్ధతి, మరీ ముఖ్యంగా రాజకీయ వ్యవస్థ ప్రాధాన్యతల గురించి ఆ కూలిన ప్రతిమ చెప్పుతున్నదేమిటి? మహారాష్ట్ర వ్యాప్తంగా, సువిశాల భారతావనిలో మరెన్నో చోట్ల చిన్న, పెద్ద శివాజీ విగ్రహాలు వేల సంఖ్యలో ఉన్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ప్రతి పల్లె, పట్టణంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఒక సాధారణ దృశ్యం. అలాగే మహారాష్ట్రలోని ప్రతి పట్టణంలోని ముఖ్య కూడలిలో అంబేడ్కర్ విగ్రహం మీకు తప్పక కనిపిస్తుంది. ఒక ఆరాధ్య నాయకుడి వారసత్వాన్ని స్వాయత్తం చేసుకునేందుకు ఆ గౌరవనీయుడి విగ్రహాన్ని నెలకొల్పడం లేక ఒక స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడం పాలక పార్టీలకు ఒక సులభ మార్గమయిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి అధికారానికి వచ్చినప్పుడు అంబేడ్కర్ విగ్రహాల ప్రతిష్ఠాపన, స్మారక చిహ్నాల ఏర్పాటు ఆమె ప్రభుత్వ ప్రధాన వ్యాపకంగా వర్ధిల్లింది. భక్తిప్రపత్తులతో బాబా సాహెబ్‌ను కొలిచే అభిమానగణాలతో మమేకమవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ అభిలషించింది. అయితే ఆ మహా దేశభక్తుడు, ప్రజాస్వామ్య దార్శనికుడు జాతి జీవనంలో సుస్థిరపరిచిన రాజ్యాంగ విలువలు, సంప్రదాయాలను పాటించడాన్ని మాయావతి పార్టీ మరచిపోయింది. మహారాష్ట్రలో సైతం శివాజీ మహరాజ్ బృహత్ విగ్రహాలను (పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో) నిర్మించేందుకు నాయకులు ఒకరిని మించి మరొకరు పోటీ పడుతుండడం కద్దు. మరి అంతే జరూరుగా నాణ్యమైన పాఠశాలల ఏర్పాటు, సకల సదుపాయాలు ఉన్న ఆస్పత్రుల నిర్మాణ ఆవశ్యకత గురించి కనీస మాత్రంగానైనా ఆలోచించే నేతలు ఎంత మంది? ఉదాహరణకు ముంబై తీరరేఖకు దూరంగా అరేబియా సముద్రంలో శివాజీ మహరాజ్ స్మారక చిహ్నాన్ని నెలకొల్పాలని 2004లో నాటి కాంగ్రెస్ - ఎన్‌సిపి సంకీర్ణ ప్రభుత్వం ప్రతిపాదించింది. తదాది ఎన్నో ప్రభుత్వాల ఉత్థానపతనాలు జరిగాయి. ప్రతి ప్రభుత్వమూ, న్యూయార్క్‌లోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీకి దీటుగా ముంబైకి అభిముఖంగా అరేబియా సముద్రంలో శివాజీ స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని చెబుతూ వస్తోంది. మహారాష్ట్ర ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం రాష్ట్ర రుణ భారం రూ.7 లక్షల కోట్లకు మించిపోయింది. ఆ అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ రూ. 48,000 కోట్లకు పైగా ఉన్నది. మహారాష్ట్ర ఇప్పటికీ మన దేశంలో పారిశ్రామికాభివృద్ధిలో అగ్రగామి రాష్ట్రంగా ఉన్నది. జాతీయ దేశీయోత్పత్తికి అత్యధికంగా తోడ్పడుతున్నది కూడా మహారాష్ట్రే. అయితే వ్యవసాయ రంగంలో పురోగతి బాగా మందగించిపోయింది. గత ఏడాది రుతుపవనాలు దోబూచులాడడంతో పంటల దిగుబడులు పూర్తిగా దిగసిల్లిపోయాయి. గ్రామీణ ప్రాంతాల ఆర్థికత పూర్తిగా కుదేలయిపోయింది. గ్రామీణుల దురవస్థలు మిక్కుట మయ్యాయి. ఫలితంగానే గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని వెయ్యికి పైగా గ్రామాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించవలసిన అగత్యమేర్పడింది. రాష్ట్రంలో పలు భారీ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో వాటి అంచనా నిర్మాణ వ్యయాలు బాగా పెరిగిపోయాయని డిసెంబర్ 2022లో కాగ్ నివేదిక ఒకటి వెల్లడించింది. 2024లో మొదటి ఆరునెలల కాలంలో 500 మందికి పైగా రైతులు ఆత్మహత్యచేసుకున్నారు. గత పావు శతాబ్ది కాలంగా మహారాష్ట్రలో ఈ బలవన్మరణాల కథ పదే పదే పునరావృతమవుతూనే ఉంది. చాలా కాలంగా ఉన్న వ్యవసాయక సంక్షోభానికి ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి ఏ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది? ఇది సమాధానం లేని ప్రశ్నే. అన్నదాతల 'వ్యథలు చించడం'పై దృష్టిని కేంద్రీకరించడం కంటే అరేబియా సముద్రంలో శివాజీ బృహత్ విగ్రహాన్ని నెలకొల్పుతామనే హామీ ఇవ్వడమే తేలిక కదా. తద్వారా పతాక శీర్షికలలో ఉంటూ ప్రజల మద్దతునూ పొందవచ్చు అనేది పాలక వర్గాల మనోగతంగా ఉన్నది. మరి పరిపాలనను చక్కదిద్ది దురవస్థల నుంచి రైతులను గట్టెక్కించేదెప్పుడు? ఈ అభాగ్య రైతుల ముత్తాతల ముత్తాతలే కాదూ మహాశక్తిమంతమైన మొగల్ చక్రవర్తి సేనలను ఛత్రపతి శివాజీ నేతృత్వంలో అరివీరభయంకరంగా ఎదుర్కొని విజయాలు సాధించి మరాఠా సామ్రాజ్యానికి పునాదులు వేసింది, శివాజీ మహరాజ్ శౌర్య సాహసాల ఘనతకు, పరిపాలనా దక్షతకు వెన్నుదన్నుగా నిలబడింది ఆ మట్టి మనుషులే కదా. మరి ఆ వీరుల వర్తమాన వారసుల తలసరి ఆదాయాన్ని పెంపొందించడానికి నేటి ప్రభుత్వాలు అంకితమవ్వడమే శివాజీ స్మృతిని సమున్నతంగా గౌరవించడమవుతుంది. అంతేగానీ ఆ మహా నాయకుడి పేరిట మరో స్మారకచిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడమనేది ప్రజా శ్రేయస్సుకు దోహదం చేసే పని ఎంతమాత్రం కాదు, కాబోదు. శివాజీ విగ్రహం కూలిపోయినందుకు గుండెలు బాదుకుంటున్న రాజకీయవేత్తలను నేను ఒక ప్రశ్న అడగదలిచాను: రాజకీయ నైతికత, ప్రజా జీవితంలో విలువల పతనమవడం పట్ల కూడా మీరు పరితాపం చెందుతున్నారా? చెందనిపక్షంలో మన జాతి ఇతిహాసంలో ఒకే ఒక్కడు అయిన శివాజీ మహరాజ్‌కు నిజమైన వారసులమని చెప్పుకునే నైతిక అధికారం మీకు లేదుగాక లేదు. శివాజీ మహరాజ్ విగ్రహ పతనం పట్ల ప్రధానమంత్రి సత్వరమే ప్రతి స్పందించి క్షమాపణలు చెప్పారు. అయితే ఆయనగానీ, మరే ఇతర సీనియర్ నాయకుడుగానీ ఇన్నాళ్లుగా అన్నదాతల ఆవేదనలో పాలుపంచుకున్నారా? అనేక సంవత్సరాలుగా పదే పదే సంభవిస్తున్న రైతన్నల ఆత్మహత్యలకు అనుతాపం చెందారా?

# రాజమండ్రిలో చిరుత సంచారం





**రాజమండ్రి** :రాజమండ్రి దివాన్‌చెరువు సమీపంలో చిరుతపులి పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు లాలాచెరువు, దివాన్‌చెరువు సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. తూర్పుగోదావరి జిల్లా ఇంఛార్జి డీఎఫ్‌వో ఎస్.భరణి మీడియా సమావేశం నిర్వహించి దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో లభ్యమైన పాదముద్రలను బట్టి ఇక్కడ సంచరించింది చిరుతపులిగా నిర్ధారణచేసినట్లు డీఎఫ్‌వో భరని ధృవీకరించారు. రాజమండ్రి దివాన్‌చెరువు, లాలాచెరువు సమీపప్రాంతాల్లోని ముఖ్యంగా స్వరూప్ నగర్, పద్మావతి నగర్, రూప నగర్, శ్రీరామ్‌నగర్, తారకరామానగర్, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈప్రదేశాల్లో చిరుత తప్పకుండా సంచరిస్తుందన్నారు. ఎవ్వరూ ఆరు బయట కూర్చొవద్దని, బయటకు రావాల్సి వస్తే వెంట టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా ఆరుబయట ఉండే బాత్‌రూమ్ తలుపులుకు గడియ పెట్టుకోవాలని, చిన్నపిల్లల్ని ట్యూషన్లుకు చీకటి పడిన తరువాత పంపవద్దని, పిల్లలు బయట ఆడుకోనివ్వ వద్దని హెచ్చరించారు ఇప్పటివరకు మనుషులపై ఎటువంటి దాడి జరగలేదని, త్వరలోనే చిరుతను పట్టుకుంటామన్నారు. అందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. అయితే చిరుత బిహేవియర్‌ను బట్టి ఎన్ని రోజుల్లో పట్టుకోగలము అనేది ఆధారపడి ఉంటుందని, అనుమానం ఉన్నచోట్ల ట్రాప్‌కెమెరాలను, బోన్లు ఏర్పాటు చేస్తున్నామని డీఎఫ్‌వో తెలిపారు. చిరుతకు సంబందించిన సమాచారం ఏమున్నా వెంటనే తెలపాలని సూచించారు. రాత్రి అయితే చాలు రాజమండ్రి శివారు ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో చిరుతపులి సంచారంతో భయం భయంగా గడుపుతున్నారు. పులి సంచారం చేస్తున్న ప్రాంతాలుగా భావిస్తున్న చోట దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. పలు చోట్ల ఫ్లెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు. రాజమండ్రి శివారు ప్రాంతాలకు ముఖ్యంగా చిరుత పులులు దారితప్పి వచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి.. రాజమండ్రి శివారు ప్రాంతంలోని దివాన్‌చెరవు ను ఆనుకుని దూరంలో అడ్డతీగల రిజర్వుఫారెస్ట్ ఉండగా అక్కడి నుంచే తరచూ చిరుత పులులు దారితప్పి ఇటువైపుగా వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఏదైనా జంతువును వేటాడే క్రమంలో దారితప్పి ఇలా జనావాసాల్లోకి చొరబడతాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. రాజమండ్రి దివాన్‌చెరువు సమీపంలో చిరుతపులి పాదముద్రలు గుర్తించిన అటవీ శాఖ అధికారులు లాలాచెరువు, దివాన్‌చెరువు సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో లభ్యమైన పాద ముద్రలను బట్టి చిరుతపులిగా నిర్ధారించినట్లు డీఎఫ్‌వో ధృవీకరించారు. ముఖ్యంగా స్వరూప్‌నగర్, పద్మావతినగర్, రూప్‌నగర్, శ్రీరామ్‌నగర్, తారకరామానగర్, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రిపూట ఎవ్వరూ ఆరుబయట కూర్చొవద్దని, బయటకు రావాల్సి వస్తే వెంట టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. చిన్న పిల్లల్ని ట్యూషన్లుకు చీకటి పడిన తరువాత పంపవద్దని, పిల్లల్ని బయట ఆడుకోనివ్వద్దని హెచ్చరించారు.'ఈ నెంబరుకు కాల్ చేయండి'ఇప్పటివరకు మనుషులపై ఎటువంటి దాడి జరగలేదని, త్వరలోనే చిరుతను పట్టుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు డీఎఫ్‌వో వెల్లడించారు. అనుమానం ఉన్నచోట్ల ట్రాప్ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిరుతకు సంబందించిన సమాచారం ఏమన్నా తెలిస్తే 18004255909 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మరోవైపు, చిరుత సంచారంతో రాజమండ్రి శివారు ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో భయం భయంగా గడుపుతున్నారు. పులి సంచారం చేస్తున్న ప్రాంతాలుగా భావిస్తున్న చోట దండోరా వేయించి ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పలు చోట్ల ఫ్లెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు.

## ఒంటరి మహిళలు జాగ్రత్త...చంపడానికి వస్తున్న లేడీ సైనేడ్ కిల్లర్స్




**గుంటూరు** :గుంటూరు పోలీసులు అరెస్టు చేసిన లేడీ కిల్లర్స్ చేసిన హత్యల గురించి వింటుంటే ఒక్కసారిగా వెన్నులో వణుకు పుడుతుంది. తెనాలిలోని యడ్ల లింగయ్య కాలనీ కి చెందిన ముడియాల వేంకటేశ్వరి అలియాస్ బుజ్జి అనే 32 ఏళ్ల మహిళ తన తల్లి రమణమ్మ మరో కొంతమంది తో కలిసి ఒక గ్యాంగ్ లా ఏర్పడి నాలుగు హత్యలు చేశారు. ఇందులో బుజ్జి అత్తగారు సహా వారికి అప్పు ఇచ్చిన మరో వృద్ధురాలు, షేక్ నాగూర్ బీ అనే పక్కింటావిడను బంగారం డబ్బు కోసం కూల్ డ్రింక్ లో సైనైడ్ కలిపి వేరు వేరు సమయాల్లో చంపేసిన విషయం తెలిసిందే.తెనాలిలో మోషే అనే మరో వ్యక్తిని అతని భార్య సహకారంతో ఇన్సూరెన్స్ డబ్బులో వాటా ఇచ్చేలా మాట్లాడుకుని అతనికి మద్యం లో సైనైడ్ కలిపి తాగించి చంపేశారు. కేసు దర్యాప్తులో ఈ మహిళలు చేసిన వరుస హత్యలు తెలుసుకున్న పోలీసులే షాక్ కు గురయ్యారని గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. అయితే నిజానికి వారు మరో ముగ్గుర్ని కూడా చంపాలని ప్లాన్ చేశారు. కానీ ఆ ముగ్గురు చాలా లక్కీ గా చావునుంచి బయట పడ్డారని ఎస్పీ తెలిపారు. థ్రిల్లర్ సినిమా ట్విస్ట్ లను తలపించే ఆ ముగ్గురి డెత్ ఎస్కేప్ ఎలా జరిగిందో మీరూ తెలుసుకోండి. 1)అన్నంలో సైనైడ్ కలిపి వాలంటీర్ ను చంపే కుట్ర –కెమికల్ రియాక్షన్ పుణ్యమా అంటూ చావు నుండి జస్ట్ మిస్‌తెనాలి టౌన్ లో నివసించే అన్నపూర్ణ అనే ఆమె వాలంటీర్ గా పనిచేస్తుంది. గతంలో వాలంటీర్ గా పనిచేసిన ముడియాల వేంకటేశ్వరికి ఆమెతో కాస్త స్నేహం ఉంది. అన్నపూర్ణ ఇంట్లో దాదాపు 1,25,000 (లక్షా ఇరవై ఐదు వేలు) రూపాయల విలువైన బంగారం ఉందని తెలుసుకున్న వేంకటేశ్వరీ అలియాస్ బుజ్జి ఆమె తల్లి రమణమ్మ కలిసి అన్నపూర్ణ తినే ఆహారంలో సైనైడ్ కలిపారు. అన్నపూర్ణ చనిపోయాక ఆమె ఇంట్లో ఉన్న బంగారం తో పాటు అన్నపూర్ణ ఒంటిపై ఉన్న నగలు కూడా కాజేయ్యాలని బుజ్జి ఆమె తల్లి ప్లాన్ చేశారు. కానీ అదృష్టవశాత్తూ అన్నపూర్ణ తినే అన్నంలో కలిపిన సైనైడ్ కెమికల్ రియాక్షన్ కు గురై ఆ రంగు మారిపోయింది. ఆహారం పాడైంది అనుకుని దాన్ని తినకుండా బయట పారెయ్యడంతో తనకు తెలియకుండానే చావు నుంచి తప్పించుకుంది అన్నపూర్ణ. ఈ సంఘటన 2022 డిసెంబర్ లో జరిగింది. 2) భర్త ఫోన్ కాల్ రావడం తో చావు నుండి తప్పించుకున్న వరలమదితెనాలిలో ఉండే మురగప్ప వరలమది అనే మహిళ తన కూతురు పెళ్లి కోసం బంగారు నగలు చేయించింది. వాటిని కొట్టేయడం కోసం మంచి మాటలతో ట్రాప్ చేశారు బుజ్జి ఆమె తల్లి రమణమ్మ. ఒకరోజు మాట్లాడేపని ఉందని వరలమది నీ ఊరి బయటకు తీసుకెళ్ళారు తల్లీ కూతుళ్ళు. థమ్స్ అప్ లో సైనైడ్ కలిపి తాగించి చంపేయాలని అనుకుంటుండగా వరలమది కి ఆమె భర్త ఫోన్ చేశాడు. ఆమె తన భర్తకు బుజ్జి,రమణమ్మ లతో కలిసి బయటకు వచ్చానని చెప్పడం విన్న బుజ్జి ఇప్పుడు వరలమది చనిపోతే తమమీద అనుమానం వస్తుందని సైనైడ్ కలిపిన థమ్స్ అప్ ఆమెకు ఇవ్వలేదు. ఇలా భర్త చేసిన ఫోన్ కాల్ భార్య వరలమదిని చావు నుంచి కాపాడింది. 3) టీలో కలిపిన మత్తు బిళ్ళలు పనిచెయ్యలేదు – బతికి పోయిన మిరాబీతెనాలిలో ఉండే షేక్ మిరాబీ అనే ఆమె దగ్గర ఉన్న 20000 రూపాయలు కాజేసేందుకు ఆమె ఇంటికి వెళ్ళిన బుజ్జి రమణమ్మ ఆమెను మాటల్లో పెట్టి టీలో మత్తు బిళ్ళలు కలిపారు. మిరాబీ మత్తు లోకి వెళ్ళగానే ఆమెకు ఊపిరాడ కుండా చేసి చంపాలని ప్లాన్ చేసారు . అయితే ఆ మత్తు టాబ్లెట్లు పని చేయకపోవడం తో వాళ్ల ప్లాన్ ఫెయిల్ అయింది.ఇలా బుజ్జి గ్యాంగ్ చేతిలో ఈ ముగ్గురు మహిళలు చావు నుంచి తృటిలో తప్పించుకోగా మిగిలిన నలుగురు మాత్రం తెనాలి లేడీ సైనైడ్ కిల్లర్స్ చేతిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా పోలీసులు ఒంటరిగా ఉండే మహిళలు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా ఎంత పరిచయం ఉన్న వారితోనైనా సరే జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

# తిరుమలలో ఆధార్ ప్రామాణికంగా సేవలు



**తిరుమల** :తిరుమలలో శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆధార్ ప్రామాణికంగా సేవలు అందించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాథమికంగా అనుమతి లభించిందని టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడనుందని వివరించారు. ఫలితంగా దర్శన, వసతి, శ్రీవారి సేవ తదితర సేవలను దుర్వినియోగం చేస్తున్న దళారులను అరికట్టవచ్చని చెప్పారు. అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ?.శ్రీవారి భక్తులకు మరింత పారదర్శకంగా లడ్డూ ప్రసాదాలు అందించాలనే లక్ష్యంతో ఆగస్టు 29వ తేదీ నుంచి దర్శనం టోకెన్ లేని వారికి ఆధార్ తో లడ్డూలను అందించే విధానాన్ని టీటీడీ ప్రవేశపెట్టిందని ప్రకటించారు.?గత కొన్నేళ్లుగా పలువురు దళారులు లడ్డూల బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించాం. తిరుమలలో దళారి వ్యవస్థను అరికట్టి, స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తగినన్ని లడ్డూలు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, దర్శనం టోకెన్లు లేనివారికి ఆధార్ కార్డుపై రోజువారి రెండు లడ్డూలను మాత్రమే జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే చాలా కాలంగా భక్తులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, బయట ప్రాంతాలలో ఉన్న టీటీడీ ఆలయాలు, చెన్నై, బెంగళూరు, వెల్లూరులలోని టీటీడీ సమాచార కేంద్రాలలో లడ్డూల డిమాండ్ ఉన్నప్పటికీ మేము పంపలేకపోయాము. ప్రస్తుతం పంపిస్తున్నాం. గత నాలుగు రోజుల్లో దాదాపు 75 వేల లడ్డూలు పంపబడ్డాయి" అని ఈవో శ్యామలరావు వివరించారు.తిరుమలలో దర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు ఒక ఉచిత లడ్డూతో పాటు, రూ.50/- ప్రాతిపదికన కోరినన్ని లడ్డూలు (స్టాక్ లభ్యత ఆధారంగా) అందజేస్తున్నామని స్పష్టం చేశారు. దీనికి ఆధార్ కార్డు అవసరం లేదన్నారు. ఆవు నెయ్యి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు లడ్డూ ప్రసాదాల నాణ్యతను పెంచేందుకు, సువాసన, రంగు, రుచి ఉండే నెయ్యి కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న టెండర్ షరతులను అనుసరించి నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గతంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ పెట్టడం జరిగిందని వెల్లడించారు.కాలినడకన వచ్చే భక్తులకు అలిపిరి పాదాలమండపం వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేయు కౌంటర్లు మరియు గాలిగోపురం వద్ద స్కానింగ్ కౌంటర్లను త్వరలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈవో పేర్కొన్నారు. "?శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు, ముఖ్యంగా అక్టోబర్ 8వ తేదీ శ్రీవారి గరుడసేవను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. ? ?జూన్ నెల మొదటి వారంలో యాత్రికులకు వారానికి 1.05 లక్షల ఎస్ఎస్ డి టోకెన్లు ఇవ్వగా, ఇప్పుడు వారానికి 1.63 లక్షల టోకెన్‌లు జారీ చేస్తున్నాం. ఎస్ఎసడి టోకెన్స్ పెంచిన కారణంగా ఈ టోకెన్ పొందిన భక్తుల నిరీక్షించే సమయం గణనీయంగా తగ్గింది" అని ఈవో ప్రకటించారు.త్వరలో బెంగళూరుకు, హైదరాబాద్ కు చెందిన నిపుణులు తిరుమల లోని వివిధ అన్నప్రసాద కేంద్రాలను సందర్శించనుందని ఈవో తెలిపారు.?అన్నప్రసాద విభాగాన్ని ఆధునికరించడంతో పాటు అన్నప్రసాదాల పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసే చర్యలు తీసుకుంటామన్నారు.?వీరందించే సూచనల మేరకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అన్నప్రసాద విభాగాన్ని శాశ్వతంగా సంపూర్ణ స్థాయిలో ఆధునికరిస్తామన్నారు. ?శ్రీవారి భక్తుల నుదుటన పవిత్రమైన "తిరునామం" ధారణ కార్యక్రమం, తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాలలో శుక్రవారం నుండి పునఃప్రారంభిస్తున్నట్లు వివరించారు.

# సరుకుల పంపిణీ గందరగోళంగా

**-కళ్యాణ మండపం తలుపులు పగల కొట్టుకొని లోనికి చొచ్చుకు వచ్చిన ప్రజలు**

**-తొక్కిసలాట?. నలుగురికి తీవ్ర గాయాలు**

**- అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**మైలవరం**:వరద బాధితులకు సరుకులు పంపిణీలో గందరగోళం చోటుచేసుకుంది ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వరద బాధితులకు సరుకులు పంపిణీ కార్యక్రమంలో తొక్కి ఇస్లాట తోడు చేసుకోవడంతో నలుగురికి గాయలను ఘటన కొండపల్లిలో చోటుచేసుకుంది

కొండపల్లి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు సరుకులు ఇవ్వడం ఆదివారం మధ్యాహ్నం మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. మంత్రులు అధికారులు వెళ్లిన అనంతరం సరుకులు పంపిణీల్లో గందరగోళం చోటు చేసుకుంది. దీంతో పంపిణీదారులు కళ్యాణ్ మండపం లోపల ఉండి ప్రజలను బయటపెట్టి తలుపులు వేశారు. దీంతో ఆగ్రహానికి గురైన ప్రజలు తలుపులు నెట్టుకొని లోపలికి తెచ్చుకు వెళ్లే ప్రయత్నం చేయగా తలుపులలో నలుగురు వ్యక్తుల చేతులు పడి గాయలను పరిస్థితి చోటుచేసుకుంది దీంతో ప్రజలు స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇక్కడ ఎలాంటి అధికారులు కూడా లేకుండా పంపిణీ చేయడం ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# కలకలం రేపుతున్న రాజకీయదాడులు




**విజయవాడ** : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు, హింసాత్మక ఘటనలు అధికారంలోకి వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ జరిగడానికి కారణం అవుతున్నాయి. గత నెలలో కనీవిని ఎరుగని మెజార్టీతో అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. నెల రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు జరిగినా వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్ ఖండిస్తున్నారు. చంద్రబాబు నాయకుల్ని పదేపదే హెచ్చరిస్తున్నారు రౌడీయిజం, గుండాయిజాన్ని సహించేది లేదని, నాయకులు సంయమనం పాటించాలని కొత్త ప్రభుత్వాన్నిముందుకు తీసుకు వెళ్లేందుకు సహకరించాలని కోరుతున్నారు.పార్టీ అధినేతలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా దాడులు, హింసాత్మక ఘటనలకు మాత్రం అడ్డు పడటం లేదు. బుధవారం రాత్రి వినుకొండలో వైసీపీ సానుభూతిపరుడైన యువకుడిని ప్రత్యర్థి దారుణంగా నరికి చంపడం తీవ్ర సంచలనం సృష్టించింది. గత నెల రోజులుగా అధికార పార్టీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు పెద్దగా ప్రచారం లభించకపోయినా బుధవారం జరిగిన యువకుడి దారుణ హత్య అందరిని ఉలిక్కి పడేలా చేసింది. పల్నాడు జిల్లా ఎస్పీని బదిలీ చేసిన రోజుల వ్యవధిలో పల్నాడులో జరిగిన హత్య, వైసీపీకి రాజకీయంగా ఊపిరి పోసింది.నడిరోడ్డుపై జరిగిన హత్యపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. గురువారం ఉదయంలోపు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వీడియోలు వైరల్‌గా మారాయి. టీడీపీ జరుగుతున్న నష్టాన్ని గుర్తించేలోపు వినుకొండ యువకుడి హత్య ఘటన వైరల్ అయిపోయింది. టీడీపీ నేతలు హత్యకు పాల్పడిన జిలానీ తమ పార్టీకి చెందిన వాడు కాదని, ఇద్దరి మధ్య పాతకక్షలతో ఘటన జరిగిందని చెప్పుకునే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది.ఏపీలో ఘోర పరాజయం తర్వాత అసెంబ్లీలో అడుగు పెట్టడానికి కూడా వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆసక్తి చూపలేదు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత బెంగుళూరు వెళ్లిపోయారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఉండటానికే జగన్ బెంగుళూరు వెళ్లిపోయారని టీడీపీ నేతలు విమర్శించారు. వినుకొండలో రషీద్ హత్య తర్వాత జగన్ వెంటనే విజయవాడ వచ్చారు.బుధవారం రాత్రి వినుకొండలో రషీద్ అనే యువకుడిని షేక్ జిలానీ అనే మరో యువకుడు హత్య చేశాడు. వీళ్లిద్దరూ ఒకప్పుడు స్నేహితులే. వైసీపీలో ఉండేవారు. వినుకొండలో రౌడీగా చలామణీ అవుతున్న పీఎస్ ఖాన్ ముఠాలో రషీద్, జిలానీ సభ్యులుగా ఉండేవారు. తర్వాత . వీరి మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. 2022 తొలి ఏకాదశి రోజున వినుకొండలో జరిగే కొండ తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీలో వీరి మధ్య గొడవలు మొదలయ్యాయి.ఖాన్ ఓ లాడ్జిలో నిర్వహించిన పార్టీలో జిలానీ బీర్ బాటిళ్లతో దాడి చేయడంతో ఒక యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటనలో ఖాన్.. రషీద్ కు మద్దతుగా నిలిచాడు. జిలానీపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆ తర్వాత రషీద్, ఖాన్ గ్యాంగ్‌లో మరి కొందరు గత ఏడాది జూలైలో జిలానీ ఇంటిపై దాడి చేశారు. జిలానీ ఇంట్లో లేకపోవడంతో అతని అన్న జానీపై దాడి చేసి గాయపరిచారు.ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. ఇంటి ముందు వాహనాన్ని కూడా తగలపెట్టారు. ఎమ్మెల్యే బొల్లా కారణంగా పోలీసులు జిలానీ కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు పట్టించుకోలేదు. యువకుడిపై దాడి కేసులో జిలానీపై హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపారు. దీంతో గత ఏడాది అతని టీడీపీ గూటికి చేరాడు. అదను చూసి హత్యకు పాల్పడ్డాడు. తన ఇంటిపై రషీద్ దాడి చేసిన రోజే ప్రత్యర్థిని మట్టుబెట్టాడు.జిలానీ, రషీద్‌ల మధ్య ఉన్న వ్యక్తిగత శతృత్వాలకు రాజకీయాలు అండగా నిలవడతంతో అవి కాస్త హత్యలకు తెగించేలా ప్రోత్సహించాయి. వినుకొండలో హత్య తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రం విడుదలను కూడా వాయిదా వేసుకున్నారు. గురువారం శాంతిభద్రతలపై సచివాలయంలో చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయాల్సి ఉంది. అదే సమయంలో వినుకొండ హత్య తీవ్ర సంచలనం సృష్టించడంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. వచ్చే వారం మొదలయ్యే అసెంబ్లీ సమావేశాల్లో వాటిని విడుదల చేయాలని నిర్ణయించారు.వినుకొండలో జరిగిన హత్యపై వైసీపీ అధ్యక్షుడు ప్రధానికి లేఖరాశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని,వైసీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి, ఆ వెంటనే.. ఈ ఎన్నికల్లో తమను సమర్థించని, తమకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా మా పార్టీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను వేధించడమే పనిగా పెట్టుకుంది.తమ కార్యకర్తల్ని కొట్టడం, చంపడం, దారుణంగా వేధించి భయానక పరిస్థితులు సృష్టించడం వంటివన్నీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆస్తులు విధ్వంసం చేస్తున్నారు. ఇళ్లు, భవనాలు కూల్చేస్తున్నారు. వ్యాపార సంస్థలపైనా దాడులు చేస్తున్నారు.

# బెజవాడలో భారీగా పెరుగుతున్న వరద




**విజయవాడ** : క్రిష్ణా నదిలోకి వరద ప్రవాహం భారీగా చేరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. వరద ప్రవాహం పెరిగితే ఇబ్బందులు ఎదురయ్యే జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణ, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని ప్రభావిత ప్రాంతాల అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎప్పటికప్పుడు కృష్ణా వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేస్తున్నట్లు విపత్తు నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కృష్ణానది మీద ప్రాజెక్టులోని నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు, లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు బోట్లు, మోటార్ బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించవద్దని హెచ్చరించారు. వరద నీటిలో ఈతకు వెళ్లడం, స్నానాలకు దిగడం, చేపలు పట్టడం వంటి పనులు చేయకూడదని స్పష్టం చేశారు. పశువులు, గొర్రెలు, మేకలు వంటి జంతువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరోసారి ఆయన స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా నదుల వరద ప్రవాహంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని కీలక ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరుతోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద స్వల్పంగా కృష్ణానది వరద పెరుగుతోంది. ప్రస్తుతం ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 2.67 లక్షల క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. సుంకేసుల వద్ద ఇన్ ఫ్లో 47,600 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 47,235 క్యూసెక్కులు ఉంది. శ్రీశైలం డ్యామ్ వద్ద ఇన్ ఫ్లో 3.32 లక్షల క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 2.70 లక్షల క్యూసెక్కులు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద ఇన్ ఫ్లో 3.51 లక్షల క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 2.70 లక్షల క్యూసెక్కులు నీటి నిల్వ ఉంది. పులిచింతల వద్ద ఇన్ ఫ్లో 2.50 లక్షల క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 2.88 లక్షల క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. గోదావరి కృష్ణా నదుల వరద హెచ్చుతగ్గుల దృష్ట్యా పూర్తిస్థాయిలో వరద తగ్గేంతవరకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అత్యవసర సహాయం కావాల్సిన వారి కోసం అధికార యంత్రాంగం ప్రత్యేకంగా నెంబర్లను కేటాయించింది. వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు.. అత్యవసర సహాయం కోసం కొన్ని ఫోన్ నెంబర్లను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. సహాయం కావాలనుకునే వాళ్ళు 1070, 112, 18004250101 టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండి కూర్మనాద్ వెల్లడించారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రభుత్వ అధికారులు జారీచేసే సూచనలను పాటించాలని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి ప్రమాదానికి గురి కావద్దని ఆయన స్పష్టం చేశారు.

# ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ లోఇళ్లపై రంగనాథ్ సూచనలు



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేయాలని.. వాటికి భవిష్యత్తు ఉంటుందని చాలా మంది అనుకుంటారు. తాము కష్టపడి సంపాదించిన సొమ్మును హైదరాబాద్‌లోని భూములు, ప్లాట్లపై పెడతారు. అలాంటి వారికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక సూచన చేశారు. హైదరాబాద్ నగరంలో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేయాలనుకునేవారు ఈ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.నివాసం ఉంటున్న గృహాలను కూల్చబోం. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్నారు. కొత్త నిర్మాణాలు మాత్రమే కూలుస్తున్నాం. ఇప్పటికే నిర్మించి నివాసముంటున్న ఇళ్లను కూల్చివేయడం లేదు. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో స్థలాలు, ఇళ్లు కొనుగోలు చేయొద్దు. కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. తర్వాత ఇబ్బందులు పడొద్దు' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. హైడ్రా ప్రకటనలో కీలకాంశాలు.. 1.ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాలు ఆక్రమించినప్పటికీ.. ఇల్లు, నివాసం ఏదీ కూల్చివేయడం లేదు. 2.ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లోకి వచ్చే కొత్త నిర్మాణాలు మాత్రమే కూల్చివేస్తాం. మాదాపూర్ సున్నం చెరువు, దుండిగల్‌లోని మల్లంపేట్ చెరువులో ఈ రోజు కూల్చిన నిర్మాణాలు నిర్మాణంలో ఉన్నాయి. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో అనుమతి లేకుండా నిర్మిస్తున్నారు. 3.అమీన్‌పూర్‌లో కూల్చివేసిన నిర్మాణాలు.. ప్రధానంగా కాంపౌండ్ గోడలు, గదులు, షెడ్‌లు ఆక్రమణకు గురయ్యాయి. కాటసాని రాంభూపాల్ రెడ్డికి సంబంధించిన కొన్ని షెడ్లను కూల్చివేశాం. ఏ వ్యక్తి ఆక్రమించిన ఇల్లు, నివాసం కూల్చలేదు. 4.మల్లంపేట చెరువు, దుండిగల్‌లో కూల్చిన 7 విల్లాలు ఇప్పటికీ నిర్మాణంలో ఉన్నాయి. వాటిలో ఎవరూ లేరు. భవన నిర్మాణ అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్‌లో ఉన్నాయి. బిల్డర్ విజయలక్ష్మి (స్థానికంగా లేడీ డాన్ అని పిలుస్తారు). ఆమెపై అనేక క్రిమినల్ కేసులు బుక్ అయ్యాయి. 5.సున్నం చెరువులోని నిర్మాణాలను గతంలో కూడా కూల్చివేశారు. కానీ.. వాటిని మళ్లీ తిరిగి నిర్మిస్తున్నారు. అందుకే వాటిని కూల్చివేశాం. 6.బిల్డర్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులపై స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వారిపై చాలా ఫిర్యాదులు వచ్చాయి. 7.ఎవరి ఇళ్లు కూల్చబోమని హైదరాబాద్ ప్రజలందరికీ హామీ ఇస్తున్నాం. 8.ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇల్లు, ఫ్లాట్, భూమిని కొనుగోలు చేయవద్దని ప్రజలను కోరుతున్నాము. అటువంటి ఆస్తుల కొనుగోలుదారులకు సంబంధించి ఏదైనా సందేహం ఉంటే.. వారు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌ను గానీ.. అధికారులను గానీ సంప్రదించాలి.

# కాంగ్రెస్ లో ప్రోటోకాల్ రగడ

**కరీంనగర్ :** తెలంగాణ కాంగ్రెస్లో కొత్త తలనొప్పి మొదలైంది. తమ విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలే రచ్చ చేస్తుండటం పార్టీ పరువును బజారుకీడ్చుతోంది. సహజంగా ప్రొటోకాల్ విషయంలో విపక్షాలు విమర్శలు సంధిస్తుంటాయి. కానీ,ఇక్కడ మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యేలే విపక్ష పాత్రను పోషించాల్సి వస్తోందంటున్నారు.వరుసగా ఒకరి తర్వాత మరొకరుగా అధికారులు, పోలీసుల వ్యవహారశైలిపై విమర్శలు సంధిస్తుండటంతో ప్రభుత్వంలో ఏం జరుగుతోందనే చర్చ మొదలైంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రెండురోజుల క్రితమే కొందరు పోలీసులపై స్పీకర్కు ఫిర్యాదు చేయగా, తాజాగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కూడా అధికారుల తీరుపై నిరసన స్వరం వినిపించడం హాట్టాపిక్గా మారింది.గత పదేళ్లు బీఆర్ఎస్ లో అవమానాలు భరించలేకనే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చామని.. తీరా ఇక్కడా పద్ధతులు మారడం లేదని మరో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. కావాలనే అధికారులు తమని తక్కువ చేసి చూస్తున్నారని కొందరు ఎమ్మెల్యేలు వాపోతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కావడంతో చాలామంది బయటకు చెప్పుకోలేక లోలోపల మదనపడుతున్నట్లు గాంధీభవన్లో టాక్ వినిపిస్తుంది. తాము అడిగిన సమాచారం ఇవ్వడం లేదని మంత్రులు సైతం తమ సన్నిహితుల వద్ద గొణుగుతున్నల్లు చెబుతున్నారు. ఇక కార్పొరేషన్ చైర్మన్లు అయితే, పవర్ లేని పదవి తీసుకొని తప్పు చేశామని గొల్లు మంటున్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటుతున్నా ప్రభుత్వంపై పట్టు సాధించలేదని అధికార పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మంత్రులంతా దాదాపు కొత్తవారు కావడంతో అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అవుతోందంటున్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ సైతం గుర్తించినా ఎలా హ్యాండిల్ చేస్తే ఏమవుతుందో అని ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైనప్పటికీ అధికార యంత్రాంగం అంతా పాతదే కావటం వల్ల కొత్త ప్రభుత్వాన్ని లైట్గా తీసుకుంటున్నారా అన్న చర్చ నడుస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలే ప్రొటోకాల్ పాటించడం లేదని వాపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వేముల వీరేశం తీవ్ర దుమారం రేపగా, తాజాగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఓ పోలీసు అధికారి వేధింపులకు గురిచేస్తున్నారనే సమాచారం కాంగ్రెస్ నేతలను షాక్కు గురిచేస్తోంది. మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్ సీఐగా



తనకు నచ్చిన వారిని ముఖ్యమంత్రి అనుమతితో ఎమ్మెల్యే నియమించుకున్నారట.. ఈ నియామకాన్ని జీర్ణించుకోలేని అక్కడి పోలీస్ కమిషనర్ ఏకంగా ఎమ్మెల్యేనే టార్గెట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.కమిషనర్ తనను వేధిస్తున్నట్లు స్వయంగా ఎమ్మెల్యేనే వాపోతుండటంతో అధికారుల తీరు చర్చకు తావిస్తోంది. పోలీస్ కమిషరే కాకుండా మానకొండూరులో ఏ అధికారి కూడా ఎమ్మెల్యేను లెక్క చేయడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇదే విధంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విషయంలోనూ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కూడా ఎమ్మెల్యేల మాదిరిగా అవమానాలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఏ సమాచారం అడిగినా అధికారులు సరిగా స్పందించడం లేదని ఎమ్మెల్సీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల్లో ఎక్కువ మంది కొత్తవారు కావడంతో కొందరు అధికారులు వారిని తప్పుదారి పట్టిస్తున్నట్లు సచివాలయ ఉద్యోగ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకే ఇలాంటి అవమానాలు ఎదురవుతుంటే తమ పరిస్థితి మరింత ఘోరంగా ఉందని కార్పొరేషన్ చైర్మన్లు వాపోతున్నారు.ఛార్జ్ తీసుకోగానే తమ తమ కార్పొరేషన్ పరిధిలో గతంలో జరిగిన వాటిపై విచారణ జరిపి వాస్తవాలను బయట పెట్టాలని భావించినా.. తమకి అధికారుల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇలా మొత్తం కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు అంతా తమను పట్టించుకోవడం లేదని వరుసగా గొంతు విప్పుతుండటంతో ప్రభుత్వ పెద్దలకు ఏం చేయాలో తోచడం లేదటజ కొందరు ఎమ్మెల్యేలు నేరుగా ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్రెడ్డికి అధికారుల తీరును పూసగుచ్చినట్లు వివరించారని సమాచారం. మొత్తానికి ఈ రగడపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఐక్యమతంతో ఆదివాసీలు

**అదిలాబాద్ :** ఆదివాసీలు పోరాటానికి వెనుకాడరు. అనుకుంటే సాధించే వరకు పోరాటం ఆపరు. ఐకమత్యానికి కేరాఫ్ అడ్రస్ ఆదివాసీలు. అందుకు నిదర్శనం ఇంద్రవెల్లి ఘటన. ఇప్పటీ ప్రభుత్వంతో అనేక విషయాల్లో ఆదివాసీలు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఐకమత్యం అంటే తరుచు ఆదివాసులే గుర్తుకు వస్తారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో.. వారు ఏదైనా అనుకుంటే నెరవేర్చుకునే వరకు పోరాటం ఆపరు, వారు వారి గ్రామ పెద్దల మాటలను తప్ప వేరే వారి మాటనే వినరు అని పేరు. ఆదివాసీలను ఒప్పించాలంటే చాలా చాలా కష్టతరం అని చెప్పుకుంటారు. ఒకసారి ఆదివాసీలు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు అంటే ఇక ఆ పని పూర్తయ్యే వరకు వారి పోరాటం ఆగదని అధికారులు, రాజకీయ నాయకులు చర్చలు చేస్తుంటారు. నిత్యం కొమురం భీమ్ పోరాట స్ఫూర్తిని నింపుకుంటూ కొనసాగుతారు ఈ ఆదివాసీలు.జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసులు తమ హక్కుల కోసం ఇంద్రవెల్లిలో శాంతియుతంగా సమావేశం జరుపుతుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆదివాసులు అమరులు కాగా, మరికొందరు రక్తపు మడుగులో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని పుట్టకొకడు, గుట్టకొకడు వెళ్లి ప్రాణాలను రక్షించుకున్నారు. ఆ సంఘటనకు సరిగ్గా ఏప్రిల్ 20 నాటికి 43 ఏండ్లు అయ్యింది.ఏజెన్సీ పరిధిలోని ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న అప్పటి రైతు కూలీ సంఘం, పోర్క దొరలు (ప్రస్తుత పీపుల్స్ వార్) ఆదివాసులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, అటవీ



అధికారుల వేధింపులు, పంటలకు గిట్టుబాటు ధర లేక దళారుల మోసాలు తదితర సమస్యల పరిష్కారానికి ఇంద్రవెల్లి సమీపంలోని హీరాపూర్ లో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ రోజున వారాంతపు సంత కావడంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇది గమనించిన పోలీసులు సమావేశానికి అనుమతి లేదంటూ వచ్చే ప్రజలను లోపలికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సమావేశానికి వెళ్లే ఓ ఆదివాసీ మహిళకు పోలీసులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య మాట మంతి పెరగడంతో అది కాస్త తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో కోపోద్రిక్తురాలైన ఆ మహిళ తన చేతిలో ఉన్న కొడవలితో ఆ కానిస్టేబుల్ పొట్టలోకి కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే తన ప్రాణాన్ని వదలిపెట్టాడు.

# భారీ వినాయకుడు... నవరాత్రులు.. ట్రాఫిక్



**హైదరాబాద్ :** వినాయక చవితి వచ్చిందంటే రాజధాని నగరంలో ఏ గల్లీ చూసినా వినాయక మంటపం కనిపిస్తుంది. నవరాత్రులు భక్తులు ఫుల్ హుషారుగా ఈ వేడుక చేసుకుంటారు. ముఖ్యంగా హైదరాబాద్ గణేషుడు అంటే వెంటనే ఖైరతాబాద్ విఘ్నేషుడు గుర్తుకు వస్తాడు. ఈ నవరాత్రుల్లో కనీసం 30 నుంచి 40 లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఇక్కడ భారీ బందోబస్తుతోపాటు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్లు కూడా చేస్తుంటారు. ఈ సారి కూడా ఖైరతాబాద్ గణేషుడి మంటపం చుట్టూ పలు మార్గాలను వాహనదారులకు మూసేశారు. అందుకు కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సూచించారు. ఈ మార్పులు పది రోజులపాటు అంటే వినాయక మహానిమజ్జనం వరకు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి రైల్వే గేట్ దాటి ఖైరతాబాద్ గణేషుడి విగ్రహం వైపునకు వచ్చే దారిలో వాహనాలకు అనుమతి లేదు. సచివాలయం వెనుక వైపున మింట్ కాంపౌండ్ నుంచి ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహం వైపునకు అనుమతి లేదు. ఖైరతాబాద్ పోస్టాఫీస్ నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వద్దకు గల దారిని కూడా వాహనాలకు మూసేస్తారు. రాజ్ దూత్ లేన్ నుంచి ఖైరతాబాద్ విగ్రహం వద్దకు వచ్చే దారిలో కూడా వాహనాలకు అనుమతి లేదు. నెక్లెస్ రోటరీ నుంచి ఐమాక్స్, సైఫాబాద్ పోలీసు స్టేషన్ మీదుగా మింట్ కాంపౌండ్ వైపు వచ్చే దారిలో కూడా వాహనాలను అనుమతించరు. ఈ దారులకు ప్రత్యామ్నా మార్గాలను కూడా ట్రాఫిక్ అధికారులు సూచించారు. మింట్ కాంపౌండ్ వైపు నుంచి ఖైరతాబాద్‌కు వెళ్లే వారు.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ కింది నుంచి సచివాలయం ముందు నుంచి ఎన్టీఆర్ గార్డెన్.. రోటరీ నెక్లెస్.. ఆ తర్వాత ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ ఎక్కేసి వెళ్లిపోవచ్చు. అలాగే.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు నుంచి ఇక్బాల్ మినార్.. అక్కడి నుంచి సైఫాబాద్ ఓల్డ్ పీఎస్.. అక్కడి నుంచి నిరంకారి నుంచి నేరుగా ఖైరతాబాద్ జంక్షన్‌కు వెళ్లవచ్చు.ఖైరతాబాద్ మహా గణేషుడి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వాహనాలను పార్క్ చేసుకోవడానికి కూడా కొన్ని పార్కింగ్ ప్లేస్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. నెక్లెస్ రోటరీ సమీపంలో ఐమాక్స్ పక్కనున్న అంబేద్కర్ స్క్వేర్‌లో తమ వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఐమాక్స్‌కు ఎదురుగా, ఎన్టీఆర్ గార్డెన్, సరస్వతి విద్యా మందిర్, రేస్ కోర్స్ రోడ్.. ఈ ఏరియాల్లో పార్కింగ్ చేసుకోవచ్చు.వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా చేస్తున్నారు. ఊరూవాడ వినాయక విగ్రహాలను నెలకొల్పి పూజలు చేస్తున్నారు. వరుణుడి కాస్త శాంతించటంతో చాలాచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ వినాయకుడు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఈసారి 70 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా 70 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహిస్తున్నారు. 7 అంకెకు ప్రాధాన్యమిస్తూ 7 తలలు, 7 సర్పాలు రెండు వైపులా 7 చొప్పున మొత్తం 14 చేతులతో విఘ్నేశ్వరుడిని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ 28 అడుగుల వెడల్పుతో విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించింది. సప్తముఖ మహాగణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు. భారీ వినాయకున్ని చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులు సెలవు రావటంతో ఎక్కువ మంది భక్తులు తరలివచ్చారు. ఇంకోవైపు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 33 మంది ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు.

# 1097 మందిపై ఎన్నికలపై అనర్హత



**నల్గొండ :** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు చేస్తోంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్థానిక నేతలు ఎప్పటి నుండో సన్నాహాలు చేసుకుంటున్నారు. అయితే కొందరికి ఓ చిక్కు సమస్య పోటీకి అనర్హులుగా చేసింది. 2019లో నల్లగొండ జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. జనవరిలో పంచాయతీలకు, ఏప్రిల్, మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఎన్నికలు జరిగాయి. పంచాయతీరాజ్ 2018 చట్టం నిబంధనల మేరకు 45 రోజుల్లో ఎన్నికల సంఘానికి ఓడిన, గెలిచిన అభ్యర్థులు ఆయా ఎంపీడీవోలకు లెక్కలు సమర్పించాల్సి ఉంటుంది. ఓడిపోయామని కొందరు, అవగాహన లేక మరికొందరు లెక్కలు చూపలేదు. దీంతో నల్లగొండ జిల్లాలో 1097 మందిపై ఎన్నికల్లో పోటీచేయకుండా ఎన్నికల సంఘం 2021లో నిషేధం విధించింది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తు ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయక నిషేధం బారిన పడిన అప్పటి అభ్యర్థులు ఇప్పుడు పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు.గ్రామ పంచాయతీల పాలక మండళ్ల పదవీ కాలం ఫిబ్రవరి 4కు ముగిసింది. మండల, జిల్లా పరిషత్ లకు జూన్ పదవీకాలం ముగిసిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం గడువులోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతోంది. అయితే తాజాగా ప్రభుత్వం తాజాగా స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు చేస్తోంది. ఎన్నికల వివరాలు సమర్పించని నేతలపై ఎన్నికల సంఘం విధించిన మూడేళ్ల సమయం 2024 జులైతో ముగిసింది. నల్లగొండ జిల్లాలో సర్పంచులు16, వార్డు సభ్యులు1021, ఎంపీటీసీ సభ్యులు 54, జడ్పీటీసీ సభ్యులు ఆరుగురు అనర్హత వేటు పడి ఉన్నారు. ప్రభుత్వం.. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికలు గడువులోగా నిర్వహించి ఉంటే వారికి పోటీ చేసే అవకాశం లేకపోయేది. పోటీకి అవకాశం రావటం, రిజర్వేషన్లు కూడా మారబోతున్నాయన్న సంకేతాలతో అభ్యర్థులు బలం, బలగాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తం మీద వీరికి ఆలస్య అమృతమైంది.

# మళ్లీ గవర్నమెంట్ వర్సెస్ గవర్నర్



**చెన్నై** :తమిళనాడులో గవర్నర్‌కు , అక్కడి ప్రభుత్వానికి మధ్య వ్యవహారం ఎప్పుడూ ఉప్పు నిప్పుగానే ఉంటుంది. మరోసారి అలాంటి పరిస్థితులు ప్రారంభమయ్యాయి. గవర్నర్ సీటీ రవి టీచర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు తమిళనాడులోనే ప్రభు?త్వ స్కూల్స్ పరిస్థితిపై విమర్శలు చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని పూర్తిగా వెనుకబడిపోయారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారిలో 75 శాతం మందికి రెండు అంకెల సంఖ్యను గుర్తించడం చేతకావడం లేదని టీచర్స్ డే కార్యక్రమంలో గవర్నర్ రవి అన్నారు. అలాగే నలభై శాతం మంది తొమ్మిది తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలను చదవలేకపోతున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్ని చక్కదిద్దాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదని గవర్నర్ వ్యాఖ్యానించారు. గవర్నర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.అయితే తమిళనాడులో విద్యావిధానం చాలా గొప్పగా ఉందని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. మంచి సిలబస్.. స్వతంత్ర, విశాలమైన ఆలోచనల్ని ప్రోత్సహిస్తుందని ఇలాంటి వాటిని బేరీజు వేసుకుంటే దేశంలోనే తమిళనాడు సిలబస్ అత్యంత విజయవంతమైనదన్నారు. దేశవ్యాప్తంగా తమిళనాడు విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. ఐటీ ఇండస్ట్రీలో తమిళ యూత్ తమదైన ప్రతిభ చూపుతున్నారని సిలబస్ బాగోలేకపోతే వీరంతా ఎలా ఎదుగుతారని ఉదయనిధి ప్రశ్న. గవర్నర్ వ్యాఖ్యలు తమ విద్యార్థులు, టీచర్లను అవమానించేలా ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను సహించే ప్రశ్నే లేదన్నారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గవర్నర్ వచ్చిన సీటీ రవి అనేక సమస్యలు సృష్టిస్తూనే ఉన్నారు. బిల్లులు ఆమోదించకపోవడం.. వంటివి చేశారు. గవర్నర్ పై స్టాలిన్ సుప్రీంకోర్టులో పిటిషన్లు కూడా వేసింది. ఇటీవల కొంత కాలంగా సైలెంట్ గా ఉన్నట్లుగా ఉన్న ఆయన తాజాగా విమర్శలు ప్రారంబించడంతో డీఎంకే కూడా ఎదురుదాడి ప్రారంభించింది. ఈ వ్యవహారం ఎక్కడి వరకూ వెళ్తుందో చూడాల్సి ఉంది.

# రాజీనామాలు... ఎన్నికలు రేవంత్ కొత్త వ్యూహం

**హైదరాబాద్ :** తెలంగాణలో పది నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. పదేళ్ల బీఆర్ఎస్ పార్టీని ఓడించిన ప్రజలు పదేళ్ల తర్వాత హస్తం పార్టీకి పట్టం కట్టారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అయితే కాంగ్రెస్ పార్టీ 64 సీట్లు గెలవగా మిత్రపక్షం సీపీఐ ఒక సీటు గెలిచింది. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటుకు 60 సీట్లు అవసరం. మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం 5 సీట్లే ఎక్కువగా ఉండడంతో బీఆర్ఎస్ నేతలు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని ప్రచారం మొదలు పెట్టారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెట్టారు. దీంతో పది మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు హస్తం గూటికి చేరారు. మొదటగా ఖైతారాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తర్వాత భద్రాచలం ఎమ్మెల్యే తెల్లాం వెంకట్రావు, కడియం శ్రీహరి కాంగ్రెస్ గూటికి చేరారు. తర్వాత మరో ఏడుగురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యేల పార్టీ మార్పుపై బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయ పోరాటం చేస్తున్నారు. మొదట కాంగ్రెస్లో చేరిన దానం నాగేందర్, వెంకట్రావు, శ్రీహరి కేసు విచారణ హైకోర్టులో పూర్తయింది. తీర్పు రిజర్వు చేసింది. మిగతా ఏడుగురు ఎమ్మెల్యేల కేసు కూడా త్వరలోనే తుది దశకు వచ్చే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరలో తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని పదే పదే చెబుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే



ఫిరాయింపు కేసు ఇప్పుడు కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో కేటీఆర్ చెప్పిందే జరగబోతుందా అన్న చర్చ కూడా తెలంగాణలో జరుగుతోంది. కోర్టు తీర్పు రిజర్వు చేసిన నేపథ్యంలో ఎలాంటి తీర్పు వస్తుందో అన్న టెన్షన్ ఇటు గులాబీ శ్రేణుల్లో, అటు కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది.మరోవైపు తెలంగాణ సీఎం కొత్త ఎత్తుగడ వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతోంది. కోర్టు తీర్పుకు ముందే.. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఉప ఎన్నికలు వస్తే గెలిచే అవకాశం ఉన్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. తద్వారా ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు.. బీఆర్ఎస్ నేతల నోరు మూయించడంతోపాటు ఫిరాయింపు ఆరోపణలకు చెక్ పెట్టవచ్చన్న ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

# 'వృద్ధాప్య ఛాయలు' కనిపించకుండా ఉండాలంటే..?



ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడంలోనే కాదు, నేటి తరుణంలో ప్రతి ఒక్కరు తమ అందం పట్ల కూడా శ్రద్ధ వహిస్తున్నారు. పురుషులు, స్త్రీలు అనే తేడా లేకుండా ఇప్పుడందరూ తమ సౌందర్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో అందంగా కనిపించడం కోసం వివిధ రకాల పద్ధతులను కూడా అవలంబిస్తున్నా రు. అయితే మనకు అందుబాటులో ఉన్న పలు ఆహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకుంటే వృద్ధాప్య ఛాయలు మీద పడకుండా, ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించేలా చేసుకోవచ్చు. అలాంటి ఆహారం గురించి ఇప్పుడు తెలుసుకుందా ం.వైన్‌ను మితంగా తీసుకుంటే అది గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి సమస్యలు రాకుండా చూస్తుంది. దీంతోపాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. అంతేకాకుండా వృద్ధాప్యం కారణంగా చర్మంపై వచ్చే ముడతలు కూడా తగ్గిపోతాయి. పుచ్చకాయలు... శరీరంలో ఏర్పడే ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్లు పుచ్చకాయల్లో పుష్కలంగా ఉన్నాయి. ఇవి యవ్వనంగా కనిపించేందుకు కూడా దోహదం చేస్తాయి. అదేవిధంగా ఈ కాయల్లోని విటమిన్ ఎ, బి, సి, ఇ, జింక్‌లు శరీరానికి కావల్సిన పోషకాలను అందిస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. పుచ్చకాయలను నిత్యం తీసుకుంటే శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంటుంది. బ్లూబెర్రీలు... యాంటీ ఏజింగ్ గుణాలు బ్లూబెర్రీల్లో పుష్కలంగా ఉన్నాయి. వయస్సు మళ్లడం వల్ల వచ్చే ముడతలను తగ్గించే యాంటీ ఆక్సిడెంట్లు కూడా వీటిలో అధికంగానే ఉన్నాయి. నొప్పులు, వాపులను తగ్గించే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు బ్లూబెర్రీల్లో ఉన్నాయి. అవకాడోలు...అవకాడోలలో విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటుంది. ఇది చర్మాన్ని సంరక్షించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. శరీరంలోని పీహెచ్ విలువలను ఎల్లప్పుడూ సమతుల్యంగా ఉండేలా చూస్తుంది. యవ్వనంగా కనిపించేందుకు ఉపయోగపడుతుంది. నిమ్మకాయలు... వృద్ధాప్య ఛాయలు, ముడతలకు కారణమయ్యే ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గించే పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నిమ్మకాయల్లో పుష్కలంగా ఉన్నాయి. వీటిలోని సి విటమిన్ చర్మాన్ని సంరక్షించడంలో ఉపయోగపడుతుంది. అంతేకాదు ముడతలను కూడా తగ్గిస్తుంది. ఆలివ్ ఆయిల్... చర్మానికి ప్రకాశాన్ని, మెరుపును అందించడంలో ఆలివ్ ఆయిల్ ఎంతగానో దోహదపడుతుంది. యాంటీ ఏజింగ్ గుణాల దీంట్లో ఉన్నాయి. వృద్ధాప్య ఛాయలను దరిచేరనీయని యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఆలివ్ ఆయిల్‌లో ఉన్నాయి. గ్రీన్ టీ...చర్మంపై ఏర్పడే ముడతలను తగ్గించడంతోపాటు ఎండ కారణంగా నాశనమైన చర్మ కణాలకు పునరుజ్జీవం కలిగించే గుణాలు గ్రీన్ టీలో ఉన్నాయి. అంతేకాకుండా గ్రీన్ టీలోని ఔషధ కారకాలు వృద్ధాప్య ఛాయలను కనిపించకుండా చేస్తాయి. ఆకుపచ్చని కూరగాయలు... ఆకుపచ్చని కూరగాయల్లో చర్మాన్ని సంరక్షించే బీటా కెరోటిన్, విటమిన్ సి, విటమిన్ కె తదితర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్లు కూడా వీటిలో ఉన్నాయి. ఇవన్నీ చర్మానికి మెరుపును, ప్రకాశాన్ని కూడా ఇస్తాయి. వెల్లుల్లి... వెల్లుల్లిలోనూ యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగానే ఉన్నాయి. దీంతోపాటు యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ వంటి ధర్మాలు కూడా వీటిలో ఉన్నాయి. చర్మాన్ని సంరక్షించుకునేందుకు వెల్లుల్లి ఎంతగానో దోహదపడుతుంది. చేపలు...శరీరానికి యవ్వనాన్ని, ఆరోగ్యాన్ని కలిగించేందుకు చేపలు ఉపయోగపడతాయి. వీటిలో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు చర్మాన్ని సంరక్షించడంలోనూ కీలకపాత్ర పోషిస్తాయి. చర్మ క్యాన్సర్ రాకుండా అడ్డుకుంటాయి. పైన పేర్కొన్నవే కాకుండా చిలగడదుంపలు, గుమ్మడికాయలు, క్యారెట్లు, టమాటాలు, కొబ్బరినూనె తదితరాల్లోనూ యాంటీ ఏజింగ్ గుణాలు దండిగా ఉన్నాయి. వీటిని నిత్యం ఆహారంలో తీసుకుంటే చర్మాన్ని సులభంగా సంరక్షించుకోవచ్చు.

# వెంట్రుకలను సంరక్షించే 'బ్రహ్మి' చూర్ణం...




పుష్పించే జాతికి చెందిన మొక్క 'బ్రహ్మి'. ఇది మన దగ్గర ఎక్కువగా పెరుగుతుంది. దీన్ని ఆయుర్వేదంలో అనేక ఔషధాల తయారీలో వాడుతున్నారు. అయితే బ్రహ్మి చూర్ణం కేవలం వివిధ రకాల అనారోగ్యాలకే కాక వెంట్రుకల సంరక్షణ కోసం, జుట్టు పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ చూర్ణం ఉపయోగించి వెంట్రుకలను ఎలా రక్షించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. ఒక కప్పు నీరు, ఒక కప్పు కొబ్బరి నీళ్లను తీసుకుని వాటికి బ్రహ్మి చూర్ణం, ఉసిరికాయ పొడి కలపాలి. చిక్కని పేస్ట్‌లా వచ్చేంత వరకు ఈ రెండు పొడులను కలుపుకోవాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి ఆరిపోయే వరకు అలాగే ఉంచాలి. తరువాత తలస్నానం చేయాలి. అయితే షాంపూలతో కాకుండా కుంకుడు, శీకాయ రసంతో మాత్రమే తలస్నానం చేయాలి. వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు ఇలా చేస్తే కొద్ది రోజుల్లోనే వెంట్రుకలు నిగనిగలాడతాయి. జుట్టు కూడా ఒత్తుగా పెరుగుతుంది. బ్రహ్మి, ఉసిరిక, అశ్వగంధ పొడులను ఒక చిన్నపాటి బౌల్‌లోకి తీసుకోవాలి. ఈ మిశ్రమానికి గోరువెచ్చని నీటిని కలుపుతూ కలియబెట్టాలి. చిక్కని పేస్ట్ వచ్చే వరకు అలా చేయాలి. కొంత సమయం పాటు ఈ పేస్ట్‌ను అలాగే ఉంచాలి. అనంతరం తలకు పట్టించి ఆరనివ్వాలి. తరువాత నీటితో కడిగేయాలి. తరచూ ఇలా చేస్తే వెంట్రుకలకు ఆరోగ్యం



చేకూరుతుంది. బ్రహ్మి, అశ్వగంధ, ఉసిరి, భృంగరాజ్ పొడులను సమానంగా తీసుకుని కలపాలి. దీనికి కొన్ని తులసి, వేప ఆకులను కలపాలి. ఈ మిశ్రమాన్ని కొద్దిగా నీటిలో వేసి సన్నని మంటపై మరిగించాలి. చల్లార్చాక వచ్చే ద్రవాన్ని ఒక జార్ లాంటి పాత్రలోకి వంపాలి. అనంతరం దాన్ని ఒక రాత్రంతా అలాగే ఉంచి తెల్లారాక దాన్నుంచి పొడి, ఆకులను వడకట్టి కేవలం ద్రవాన్ని మాత్రమే తీయాలి. ఈ ద్రవంతో షాంపూలాగా తలస్నానం చేస్తే చక్కని ఫలితం ఉంటుంది.

## కొలరెక్టల్ క్యాన్సర్ ను అవగాహనతో అరికడదాం..


కొలరెక్టల్..దేశంలో నాలుగో అతి భయంకరమైన క్యాన్సర్ కారకం. దీనివల్ల ఏర్పడే క్యాన్సర్‌తో దేశంలో ఏడాదికి సుమారు 56వేలమంది



రోగులు మృత్యువాత పడుతున్నట్లు కొలరెక్టల్ సర్జరీ బృందం పేర్కొంటోంది. సాధారణంగా వచ్చే ఈ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే అరికట్టవచ్చని వైద్యనిపుణులు భరోసా ఇస్తున్నారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్లే వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోందని, ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం మార్చి నెలను కొలరెక్టల్ అవగాహన మాసంగా పరిగణిస్తున్నట్లు వైద్యనిపుణులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ క్యాన్సర్ కారకంపై నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం... పెద్ద పేగు, పురుషనాళంపై కణతులు ఏర్పడడాన్ని కొలరెక్టల్ అంటారు. పెద్దపేగు లేదా పురుషనాళానికి సంబంధించిన పేగుపై ఏర్పడిన కణతులు(వ్రణాలు) క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది.

దీనిపై చాలామందిలో అవగాహన లేక క్యాన్సర్ మరణాల్లో కొలరెక్టర్ బాధితులు మూడోస్థానంలో ఉన్నట్లు వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఎనిమిదిమందిలో ఒకరికి ఈ వ్యాధి వారి జీవిత కాలంలో ఏదో ఒక దశలో సోకుతుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. దేశంలో సుమారు 10లక్షలమందికి పైగా రోగులు కొలరెక్టల్ క్యాన్సర్‌తో జీవిస్తున్నట్లు కొలరెక్టల్ సర్జన్స్ బృందం పేర్కొంది. కొలరెక్టల్ కణాలు అభివృద్ధి చెందిన తరువాత 50శాతం మాత్రమే చికిత్స చేసే అవకాశముంటుంది. ఈ కణాలు అభివృద్ధి చెందకముందు గుర్తిస్తే 80శాతం వ్యాధిని నయం చేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. అంటే పెద్దపేగుకు ముందుగా పాలిప్స్ ఏర్పడతాయి. ఈ పాలిప్స్ ముదిరి క్యాన్సర్ కారకాలుగా మారుతాయి. వీటిని ప్రారంభదశలోనే గుర్తిస్తే పేగుపై ఏర్పడిన పాలిప్స్‌ను శస్త్రచికిత్స ద్వారా తొలగిస్తే క్యాన్సర్ నుంచి బయటపడినట్లే.వ్యాధి లక్షణాలు.. మల విసర్జనలో మార్పులు రావడం తరచూ విసర్జనకు వెళ్లడం మల విసర్జన పూర్తికానట్లు ఫీలవడం మలద్వారం నుంచి రక్తం పడడం పొట్టలో నొప్పిరావడం హఠాత్తుగా బరువు తగ్గడంతీసుకున్న ఆహారం జీర్ణం కాకపోవడం అలసట ఏర్పడడం జ రక్తహీనతకు గురవడం పొట్ట ఉదరంలో నీరు చేరడం వాంతులు, గుండెలో మంట వ్యాధిపై అవగాహన లేకపోవడంతో పై లక్షణాలను రోగులు సాధారణ సమస్యలుగా తాత్కాలిక చికిత్సతో సరిపెట్టుకుంటారు. ఫలితంగా వ్యాధి ముదిరి విషమస్థితికి చేరుకుంటుంది.కొన్ని కారణాలు.. అధికంగా మాంసం తినడం పొగ తాగడం మద్యపానం సేవించడం తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధిక కొవ్వు పదార్థాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవద్దు కూరగాయలు, పండ్లు, పీచుపదార్థాలు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి బరువును సాధారణస్థాయిలో ఉండే విధంగా చూసుకోవాలి ధూమపానం, మద్యపానం చేసేవారు నియంత్రణ పాటించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి

# క్షయ వ్యాధికి అప్రమత్తతే మందు




క్షయ (టీబీ) ఇదో మహమ్మారి రోగం. ఇట్టే సోకే అంటువ్యాధి. దీనికి చిన్నా పెద్ద, ముసలిముతక అనే తేడా ఉండదు. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, తుంపర్లతో మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్ అనే బ్యాక్టీరియా చేరుతుంది. దీనికి శరీరంలోని ఈ భాగం..ఆ భాగమనే తేడా లేదు..ఎక్కడైనా వచ్చి చేరుతుంది. తీవ్రంగా బాధిస్తుంది. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే.. మహమ్మారిని తరిమికొట్టేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. క్షయ(టీబీ) నియంత్రణ డే సందర్భంగా వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు తగ్గించుకునే తీరు మీకోసం.క్షయ సోకే విధానం...క్షయ ప్రమాదకరమైన వ్యాధి. ఇది ఒకరి నుంచి మరొకరికి చాలా సులువుగా సోకుతుంది.ఇది ఎక్కువగా ఊపిరితిత్తులకు అతి దగ్గర్లో చేరుతుంది. మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్ ద్వారా ఈ వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్రిములు గాలిలో వ్యాపించి వ్యాధిని విస్తరిస్తాయి. ఎక్కువగా ఎయిడ్స్‌తో బాధపడే వారికి వ్యాధి తప్పనిసరిగా వస్తుందని నిపుణులు చెబుతున్నారు. వ్యాధి సోకితే...వ్యాధి సంక్రమిస్తే అనేక కారణాలతో రోగి నుంచి లక్షణాలు వెలువడే అవకాశాలు ఉంటా యి. వాటిని తక్షణమే గుర్తించే అవకాశమూ ఉం ది. మూడు వారాలకు మించి అధికంగా దగ్గినప్పుడు ఈ వ్యాధి సోకినట్లు అంచనాకు రావొచ్చు. దీనికితోడు సాయంత్రం సమయంలో జ్వరం సైతం బాధిస్తుంది. ఆహారం తినే పరిమాణం, శరీర బరువు తగ్గిపోతాయి. విపరీతమైన ఛాతి నొప్పితో పాటు తెమడలో రక్తం పడే అవకాశాలు ఉంటాయి. నిర్ధారణ ఇలా..మూడు రోజుల పాటు ఉదయం తెమడ పరీక్షలు చేయించుకోవాలి. ఇలా చేయించుకున్న అన్ని పరీక్షల్లో నెగిటివ్‌గా వస్తే, ఎక్స్‌రే తీయించుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో నివేదికలు వస్తాయి. వ్యాధిని నిర్మూలించవచ్చు వైద్యులు చెప్పిన సలహాలు పాటిస్తే క్షయ వ్యాధిని తప్పక అరికట్టవచ్చు. రోగి విషయంలో ప్రత్యేక్షంగా పర్యవేక్షణ అవసరం. తక్కువ సమయంలో చికిత్స ద్వారా జబ్బును పూర్తిగా నయం చేయడానికి వీలుగా ఉంటుంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ కుటుంబాలకు వైద్యం అందుబాటులో ఉండే అవకాశాలు చాలా అరుదుగా ఉంటుంది. వైద్య ఖర్చులు అధికంగా ఉంటాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ మందులు లభిస్తాయి. కొత్తగా ఈ వ్యాధి సోకిన వారికి 6 లేక 7 మాసాల్లో, వ్యాధి ముదిరిన వారికి 8 నుంచి 9 నెలల్లో నయం చేయడానికి వీలుగా ఉంటుంది. హైదరాబాద్‌లో 10వేల టీబీ కేసులు ఉండగా 7,014మంది చికిత్స పొందినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. అరికట్టే విధానాలు...పుట్టిన బిడ్డకు వెంటనే(బీజీజీ) సూది మందు వేయించాలి. క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గు వచ్చినప్పుడు నోటికి చేతిరుమాలును అడ్డంగా పెట్టుకోవాలి.రోగి ఎక్కడపడితే అక్కడి ఉమ్మివేయొద్దు. జబ్బు నయమయ్యే వరకూ వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి.రోగి ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వెంటనే వైద్యుడి సలహాలు పాటించాలి. ఎందుకంటే అధిక శాతం ఈ వ్యాధి పిల్లల్లో వేగంగా సోకుతుంది.

# అధిక బరువు తగ్గేందుకు సింపుల్ టిప్స్...

అధిక బరువును తగ్గించుకునేందుకు నేటి తరుణంలో ప్రతి ఒక్కరు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారు అనేక రకాల పద్ధతులను కూడా అనుసరిస్తున్నారు. అయితే కింద ఇచ్చిన పలు టిప్స్‌ను కూడా పాటిస్తే శరీరంలో అధికంగా పేరుకుపోయిన కొవ్వును, తద్వారా బరువును తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆ టిప్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. 1. రోజుకి కనీసం అరలీటర్లు ఐస్‌కోల్డ్ నీటిని తాగాలి. ఇలా చేస్తే శరీర మెటబాలిజం వృద్ధి చెందుతుంది. తద్వారా అధిక బరువు కూడా తగ్గుతుంది. 2. కొబ్బరినీళ్లను ఎక్కువగా తాగాలి. ఇవి కూడా మెటబాలిజం ప్రక్రియను మెరుగుపరుస్తాయి. అధిక బరువును తగ్గించుకునేందుకు పనిచేస్తాయి. 3. శరీరంలో పేరుకుపోయిన కొవ్వు నిల్వలు కరగాలంటే స్కిమ్డ్ మిల్క్ తాగాలి. స్కిమ్డ్ మిల్క్ అంటే కొవ్వు తీసిన పాలు. ఇవి కొవ్వును కరిగించేందుకు ఉపయోగపడతాయి. 4. కూరగాయల జ్యూస్‌ను నిత్యం తాగాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి తగినన్ని పోషకాలు లభించడంతోపాటు అధిక బరువు కూడా తగ్గుతుంది. 5. గ్రీన్ లేదా బ్లాక్ టీ తాగాలి. ఇతర టీల కంటే శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించే శక్తి దాదాపు 43 శాతం వరకు ఈ టీలకే ఎక్కువగా ఉంది.



# పెట్టుబడికి పెద్ద భరోసా.. ఆ పథకంతో బోలెడు ప్రయోజనాలు



మ్యుచువల్ ఫండ్స్ కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. గతంలో బ్యాంకులు, పోస్టాఫీసులలో ఫిక్స్ డ్ డిపాజిట్లు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు వాటితో పాటు మ్యుచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు పెడుతున్నారు. వీటిలో అనేక రకాలు ఉన్నాయి. ప్రతినెలా కొంత మొత్తాన్ని ఇన్వెస్ చేసే సిస్టమాటిక్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) అందరికీ తెలిసిందే. మ్యుచువల్ ఫండ్స్ కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. గతంలో బ్యాంకులు, పోస్టాఫీసులలో ఫిక్స్ డ్ డిపాజిట్లు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు వాటితో పాటు మ్యుచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు పెడుతున్నారు. వీటిలో అనేక రకాలు ఉన్నాయి. ప్రతినెలా కొంత మొత్తాన్ని ఇన్వెస్ చేసే సిస్టమాటిక్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) అందరికీ తెలిసిందే. అలాగే మన పెట్టుబడికి నష్టం లేకుండా ప్రతి నెలా నగదును ఉపసంహరించుకునే అవకాశం ఉన్న సిస్టమేటిక్ విత్ డ్రావెల్ ప్లాన్ (ఎస్ డబ్ల్యూపీ) కూడా అమల్లో ఉంది. ఉద్యోగ విరమణ తర్వాత ప్రతి నెలా నిర్ణీత ఆదాయం కోరుకునే వారికి చాలా ఉపయోగంగా ఉంటుంది.

నెలవారీ ఆదాయం

పదవీ విరమణ సమయంలో నెలవారీ ఆదాయం కావాలనుకునేవారికి ఎస్ డబ్ల్యూపీలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. క్రమబద్ధమైన ఉపసంహరణ ప్రణాళికతో పొదుపు నుంచి స్థిరమైన నెలవారీ ఆదాయాన్ని పొందవచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, యాన్యుటీ ప్లాన్లకు పరిమితులు ఉంటాయి. అయితే ఎస్ డబ్ల్యూపీలు రిటర్న్‌మెంట్ ఆదాయాన్ని నిర్వహించడానికి అనువైన, విధానాలను చూపుతాయి. రిటర్న్‌లు, రిస్క్, నెలవారీ ఆదాయ అవసరాలపై ఆధారపడి మీ పెట్టుబడులను సర్దుబాటు చేసుకునే సౌలభ్యం కలుగుతుంది.

ఎస్ డబ్ల్యూపీ వల్ల ప్రయోజనాలు

స్థిర ఆదాయం కోసం ఎస్ డబ్ల్యూపీ అత్యంత వీలైన మార్గం. వివిధ విధానాలలో (నెలవారీ, త్రైమాసిక) నిర్ణీత మొత్తంలో డబ్బును ఉపసంహరించుకోవడానికి వీలుంటుంది. మీ జీవన వ్యయాలకు ఆదాయం అవసరమయ్యే విశ్రాంత ఉద్యోగులు ప్రయోజనం చేకూరుతుంది.

పెన్షన్ మాదిరిగానే ఎస్ డబ్ల్యూపీ కూడా మీకు ఆదాయం విషయంలో మనశ్శాంతిని కలిగిస్తుంది. ఆర్థిక ఒత్తిడిని తగ్గిస్తుంది,

పదవీ విరమణ సమయంలో కూడా ఆర్థిక క్రమశిక్షణకు దోహదపడుతుంది. అవసరమైన దానికంటే ఎక్కువ ఉపసంహరించుకోకుండా ఉండేలా చూస్తుంది, మీ ఆర్థిక వ్యవహారాలను మెరుగ్గా నిర్వహించడంలో మీకు సహాయం చేస్తుంది.

ఎస్ డబ్ల్యూపీలో మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే మీ మూలధనాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుంది. ఇవి మీకు ఆదాయాన్ని అందిస్తూనే మీ మూలధనాన్ని సంరక్షిస్తుంది. మీ పెట్టుబడిలో కొంత భాగాన్ని మాత్రమే ఉపసంహరించుకుంటున్నందున, మిగిలిన మొత్తం వృద్ధి చెందుతూనే ఉంటుంది.

ప్రతి సంవత్సరం ఆదాయం పెరిగేలా సరైన ఉపసంహరణ రేటును నిర్ణయించుకోవాలి. ఆ సమయంలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. పెట్టుబడిపై మితమైన రాబడిని అంచనా వేయడం చాలా అవసరం.

మీరు సురక్షితమైన పెట్టుబడి కోసం వెళ్లి 6 శాతంవార్షిక రాబడిని పొందుతున్నారనుకోండి. మీకు పదవీ విరమణ సమయంలో నెలవారీ రూ. 25 వేలు రావాలంటే రూ. 70 లక్షల కార్పస్ అవసరం. ఇది ప్రతి సంవత్సరం 3 శాతం చొప్పున పెరుగుతుంది. 8 శాతం వార్షిక రాబడితో రూ. 51 లక్షలు, 10 శాతం వార్షిక రాబడిపై రూ. 41 లక్షలు, 12 శాతం వార్షిక రాబడిపై రూ. 34 లక్షలు అవసరమవుతాయి.

# హోమ్ లోన్ కట్టేశారా.. ఈ విషయాలు మర్చిపోతే ప్రమాదమే..!



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇళ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. నగరాలతో పాటు ఓ మాదిరి టౌన్లలో కూడా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. బ్యాంకుల ద్వారా నెలవారీ వాయిదాలు చెల్లించేలా వీటిలో ఫ్లాట్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఉద్యోగాలు, వ్యాపారాల కోసం నగరానికి వలస వచ్చిన వారందరూ వీటిని కొనుగోలు చేస్తున్నారు. నిర్ణీత ఆదాయం, అర్హతలు ఉన్న వారందరూ సులభ వాయిదాల పద్ధతులతో వీటిని తీసుకుంటారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇళ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. నగరాలతో పాటు ఓ మాదిరి టౌన్లలో కూడా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. బ్యాంకుల ద్వారా నెలవారీ వాయిదాలు చెల్లించేలా వీటిలో ఫ్లాట్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఉద్యోగాలు, వ్యాపారాల కోసం నగరానికి వలస వచ్చిన వారందరూ వీటిని కొనుగోలు చేస్తున్నారు. నిర్ణీత ఆదాయం, అర్హతలు ఉన్న వారందరూ సులభ వాయిదాల పద్ధతులతో వీటిని తీసుకుంటారు. రుణం చెల్లించడానికి దాదాపు 20 ఏళ్ల కాలపరిమితి ఉంటుంది. ప్రతి నెలా కట్టే ఈఎంఐలో మీ రుణం, దానికి వడ్డీ కలిపే ఉంటుంది. అయితే మీరు తీసుకున్న హోమ్ లోన్ తీరిపోయిన తర్వాత ఆ విషయాన్ని వదిలేకూడదు. సంబంధిత బ్యాంకుల నుంచి కొన్ని ప్రతాలను తప్పనిసరిగా తీసుకోవాలి. అప్పుడే ఆ ఫ్లాట్ కు సంబంధించిన పూర్తి హక్కులు మీకు లభిస్తాయి. హోమ్ లోన్ తిరిగి చెల్లించిన తర్వాత మీరు తప్పనిసరిగా చేయాల్సిన ఐదు పనుల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

ఒరిజినల్ డ్యాక్యుమెంట్లు

మీరు హోమ్ లోన్ తీసుకునేటప్పుడు మీ ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను తాకట్టుగా ఉంచుతారు. లోన్ పూర్తయిన తర్వాత వాటిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఒరిజినల్ డ్యాక్యుమెంట్లు తీసుకోవడం మర్చిపోకూడదు. వీటిలో కేటాయింపు లేఖ, స్వాధీనం లేఖ, సేల్ డీడ్, బిల్డర్–కొనుగోలుదారు ఒప్పందం, ఇతర చట్టపరమైన పత్రాలు ఉంటాయి.

ఆస్తిపై పూర్తిహక్కు

గృహ రుణం తీసుకున్నవారికి ఆ ఆస్తిపై బ్యాంకు తాత్కాలిక హక్కును ఇస్తుంది. ఒకవేళ రుణాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైతే ఆస్తిని స్వాధీనం చేసుకుంటుంది. మీరు రుణాన్ని చెల్లించిన తర్వాత తాత్కాలిక హక్కు అధికారికంగా తీస్తారు. మీకు పూర్తి హక్కు కలుగుతుంది.

నో డ్యూస్ సర్టిఫికేట్

హోమ్ లోన్ ను తిరిగి చెల్లించిన తర్వాత నో డ్యూస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాలి. మీకు రుణమిచ్చిన బ్యాంక్, ఆర్థిక సంస్థ దీన్ని జారీ చేస్తాయి. మీరు రుణం పూర్తిగా చెల్లించారని చెప్పడానికి ఇది రుజువు. దీనిలో రుణగ్రహీత పేరు, ఆస్తి చిరునామా, లోన్ ఖాతా నంబర్, లోన్ మొత్తం, ప్రారంభ తేదీ, చెల్లింపు పూర్తయిన తేదీ తదితర వివరాలు ఉంటాయి. ఈ సర్టిఫికెట్ లేకపోతే మీ ఆస్తి పై ఇంకా రుణం ఉన్నట్టే భావిస్తారు.


నాన్–ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్

ఆస్తికి సంబంధించిన అన్ని ఆర్థిక లావాదేవీలు, గత విక్రయాలు, రుణాలను వివరించే చట్టపరమైన పత్రాన్నే నాన్–ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఎన్ ఈసీ) అంటారు. మీరు భవిష్యత్తులో మీ ఆస్తిని విక్రయించాలని నిర్ణయించుకుంటే ఇది తప్పనిసరిగా అవసరమవుతుంది. ఈ సర్టిఫికెట్ల ఉంటేనే మీ ఆస్తిని వేరేవాళ్లు కొనుగోలు చేస్తారు.

క్రెడిట్ స్కోర్

రుణాన్ని తిరిగి చెల్లించిన తర్వాత, మీ క్రెడిట్ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. అప్పుడే క్రెడిట్ స్కోర్ మరింత మెరుగవుతుంది. మీకు భవిష్యత్తులో రుణాలను సులభంగా పొందడానికి అవకాశం ఉంటుంది.

# బైక్ కొనే సమయంలోనే హెల్మెట్.. కేంద్ర మంత్రి చెప్పిందిదే..



నాణ్యతలేని హెల్మెట్లు వినియోగిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు అవి మనుషుల ప్రాణాలు కాపాడలేకపోతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. ఇటీవల ద్విచక్ర వాహన తయారీదారులతో జరిగిన సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వాహనాల తయారీదారులే మంచి నాణ్యమైన హెల్మెట్లను తక్కువ ధరకు అందించాలని సూచించారు. ఎన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నా.. రోడ్లు ఎంతలా అభివృద్ధి చేస్తున్నా.. రోడ్డు ప్రమాదాలు ఆగడం లేదు. వాటి వల్ల మరణాలూ ఆగడం లేదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు జరిగే ప్రమాదాల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ద్విచక్ర వాహనదారులు నాణ్యత కలిగిన హెల్మెట్ వాడకపోవడమే. ఇబ్బందిగా ఉంటుందని కొందరూ.. ధర ఎక్కువగా ఉంటుందని మరికొందరూ హెల్మెట్లను వాడటం మానేస్తున్నారు. మరికొందరు వాడుతున్నా.. రోడ్ పక్కన నాణ్యతలేని హెల్మెట్లు వినియోగిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు అవి మనుషుల ప్రాణాలు కాపాడలేకపోతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. ఇటీవల ద్విచక్ర వాహన తయారీదారులతో జరిగిన సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వాహనాల తయారీదారులే మంచి నాణ్యమైన హెల్మెట్లను తక్కువ ధరకు అందించాలని సూచించారు. వినియోగదారులు వాహనం కొనుగోలు చేసే సమయంలోనే వాటిని తప్పనిసరిగా తక్కువ ధరకు అందించాలని కోరారు. 2022లో దేశంలో హెల్మెట్ ధరించకపోవడంతో జరిగిన ప్రమాదాల్లో 50,029 మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర మంత్రి గడ్కరీ తెలిపారు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహన తయారీదారులకు కీలక సూచన చేస్తున్నట్లు మంత్రి వివరించారు. వాహనం కొనుగోలు చేసేవారికి హెల్మెట్లపై కొంత తగ్గింపు ఇవ్వగలిగితే మనం ప్రజల ప్రాణాలను కాపాడగలమని ఆయన అన్నారు. మోటారు వాహనాల (సవరణ) చట్టం, 2019 ట్రాఫిక్ నేరాలపై భారీ జరిమానాలను అమలు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ పరిస్థితుల్లో పెద్ద మార్పులు రావడం లేదని ఆయన చెప్పారు. వాస్తవానికి దీనిని అమలు చేయడం కూడా సవాలుగా ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ప్రతి తాలూకాలో డ్రైవింగ్ స్కూల్ ను ప్రారంభించాలన్నది తన ఆశయమని గడ్కరీ చెప్పారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంకలనం చేసిన "నేషనల్ స్ట్రాటజీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ అనెన్షనల్ ఇంజురీ" అనే కొత్త నివేదిక ప్రకారం, రోడ్డు ప్రమాదాలు భారతదేశంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్నాయి. అలాంటి మరణాలలో 43 శాతానికి పైగా, అతివేగమే ప్రధాన కారణం. 2022లో భారతదేశంలో 4,30,504 మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డారు. వారిలో 1,70,924 మంది బలమైన గాయాల కారణంగా మరణించారు. 2016 నుంచి 2022 వరకు డేటా చూస్తే పెరిగిందే గానీ తగ్గలేదు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈవీ కంపెనీలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కారణంగా కొనుగోలుదారులు కొంత మేర ప్రయోజనం పొందుతున్నారు. ఈ సబ్సిడీని విడతల వారీగా ప్రభుత్వం తగ్గిస్తోంది. ఫలితంగా ఆ భారం కొనుగోలుదారులపై పడే అవకాశం ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న తాత్కాలిక ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్(ఈఎంపీఎస్) ఫేమ్–3 సబ్సిడీ అమలులో ఉంది.

# ఆరోగ్య బీమాలో తొందరపాటు వద్దు



నేడు చాలామంది ఆరోగ్య బీమా కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. మారుతున్న జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పులు, పెరిగిన కాలుష్యం ఇలా.. అనేక పరిస్థితులు ఆరోగ్య బీమా ప్రాధాన్యతను పెంచేశాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ లేని కుటుంబాలు లేవంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ ఆరోగ్య బీమాలో నో–క్లెయిం బోనస్ లాభాలెంటో తెలుసా? ఆరోగ్య బీమా తీసుకున్నాక తర్వాతి రెన్యువల్ వరకు ఆ బీమాను ఉపయోగించకపోతే.. అందుకుగాను బీమా సంస్థలు పాలసీదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలే ఈ నో–క్లెయిం బోనస్‌లు. వీటిలో క్యుములేటివ్ బోనస్, ప్రీమియంపై డిస్కౌంట్లుంటాయి. తొలి సంవత్సరం ఎలాంటి క్లెయిములు లేకపోతే మలి సంవత్సరం పాలసీ తీసుకునేటప్పుడు అంతే మొత్తానికి బీమా కవరేజీ 10 శాతం మేర పెరుగుతుంది. ఉదాహరణకు రూ.20 వేలు చెల్లించి రూ.20 లక్షల పాలసీని తీసుకున్నారు. తొలి ఏడాది కాలంలో ఏ క్లెయిం చేయలేదు. దీంతో రెండో ఏడాదీ అదే రూ.20 వేలకు రూ.22 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఇక్కడ నో–క్లెయిం బోనస్ రూ.2 లక్షలు (10 శాతం) అన్నమాట. ఇలా తర్వాతి సంవత్సరాల్లోనూ రూ.2 లక్షల చొప్పున బీమా కవరేజీ పెరుగుతూపోతుంది. వీటినే క్యుములేటివ్ బోనస్‌లు అంటారు.

# డిపాజిట్లకు వేళాయెరా.. స్పెషల్ ఎఫ్‌డీలకు సమీపిస్తున్న గడువు



సురక్షిత పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ). అయితే ఆయా బ్యాంకులు డిపాజిటర్లను ఆకర్షించేందుకు కొన్ని ప్రత్యేక ఎఫ్‌డీలను తీసుకొచ్చాయి. వీటి కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగుస్తున్నది. సాధారణ డిపాజిటర్లతో పోల్చితే సీనియర్ సిటిజన్లు, సూపర్ సీనియర్ సిటిజన్లకు పావు శాతం నుంచి అర శాతం వరకు ఎక్కువే వడ్డీలొస్తున్నాయి. అవేంటో.. ఏయే బ్యాంకులు అందిస్తున్నాయో ఒక్కసారి పరిశీలిస్తే.. ఐడీబీఐ బ్యాంక్ ప్రత్యేకంగా తెచ్చిన ఉత్సవ్ ఎఫ్‌డీల్లో పెట్టుబడులు పెట్టేందుకు చివరి తేదీ సెప్టెంబర్ 30. 300, 375, 444, 700 రోజుల కాలవ్యవధితో ఈ స్పెషల్ ఎఫ్‌డీలను బ్యాంక్ పరిచయం చేసింది. 300 రోజుల ఎఫ్‌డీపై సాధారణ డిపాజిటర్లకు 7.05 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.55 శాతం వడ్డీరేటు లభిస్తున్నది. ఇక 375 రోజుల ఎఫ్‌డీపై సాధారణ కస్టమర్లకు 7.15 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీరేటున్నది. 444 రోజుల ఎఫ్‌డీపై సాధారణ పౌరులకు 7.35 శాతం, వృద్ధులకు 7.85 శాతం వడ్డీరేటు వస్తున్నది. 700 రోజుల ఎఫ్‌డీకి సాధారణంగానైతే 7.20 శాతం వడ్డీరేటు వర్తిస్తున్నది. సీనియర్ సిటిజన్లకు 7.70 శాతం వడ్డీ ఉన్నది. ఇండియన్ బ్యాంక్ స్పెషల్ ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేసేందుకున్న ఆఖరు తేదీ సెప్టెంబర్ 30. ఇండ్ సూపర్ 300 రోజుల ఎఫ్‌డీపై సాధారణ డిపాజిటర్లకు 7.05 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.55 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇక సూపర్ సీనియర్ సిటిజన్లకైతే 7.80 శాతం వడ్డీరేటును బ్యాంక్ ప్రకటించింది. అలాగే 400 రోజుల ఎఫ్‌డీపై సాధారణంగా 7.25 శాతం వడ్డీరేటున్నది. సీనియర్ సిటిజన్లకు ఇది 7.75 శాతం, సూపర్ సీనియర్లకు 8 శాతం. 222 రోజుల ప్రత్యేక ఎఫ్‌డీపై పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్.. అత్యధికంగా 6.30 శాతం వడ్డీరేటును ఇస్తున్నది. అలాగే 333 రోజుల ఎఫ్‌డీపై 7.15 శాతం, 444 రోజుల ఎఫ్‌డీపై 7.25 శాతం వడ్డీరేట్లున్నాయి. ఈ పరిమితకాల స్పెషల్ ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్‌మెంట్‌కున్న గడువు సెప్టెంబర్ 30. ఈ నెలాఖరుదాకే ఎస్బీఐ అమృత్ కలశ్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. 400 రోజులతోకూడిన ఈ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వడ్డీరేటు 7.10 శాతం. సీనియర్ సిటిజన్లకైతే 7.60 శాతం. అలాగే ఎస్బీఐ వుయ్‌కేర్ స్కీం గడువును ఈ నెల 30దాకా పొడిగించారు. కొత్త డిపాజిట్లపై, మెచ్యూరింగ్ డిపాజిట్ల రెన్యువల్‌పై మాత్రమే ఈ స్కీం వర్తిస్తుంది. ఇందులో వడ్డీరేటు 7.50 శాతం.

# వచ్చే మూడు నెలల్లో బంగారం ధర భారీగా పెరగనుంది? కారణాలు ఏంటో తెలుసా?




మీరు బంగారంపై పెట్టుబడి పెట్టాలని లేదా బంగారం కొనాలని ఆలోచిస్తున్నట్లయితే, ఆలస్యం చేయకుండా ఇప్పుడే ఈ పని చేయండి. ఈ ఏడాది చివరి మూడు నెలల్లో బంగారం ధర ఆకాశాన్ని తాకనుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. మార్కెట్ ద్రవ్యోల్బణం కొత్త రికార్డును నెలకొల్పే అవకాశం ఉంది. రాబోయే పండుగ సీజన్‌తో పాటు ఈ ద్రవ్యోల్బణం వెనుక అనేక. మీరు బంగారంపై పెట్టుబడి పెట్టాలని లేదా బంగారం కొనాలని ఆలోచిస్తున్నట్లయితే, ఆలస్యం చేయకుండా ఇప్పుడే ఈ పని చేయండి. ఈ ఏడాది చివరి మూడు నెలల్లో బంగారం ధర ఆకాశాన్ని తాకనుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. మార్కెట్ ద్రవ్యోల్బణం కొత్త రికార్డును నెలకొల్పే అవకాశం ఉంది. రాబోయే పండుగ సీజన్‌తో పాటు ఈ ద్రవ్యోల్బణం వెనుక అనేక అంశాలు ఉన్నాయి. సంవత్సరం ప్రారంభంలో ఆమోదించిన బడ్జెట్‌లో బంగారంపై కస్టమ్ డ్యూటీ తగ్గించింది కేంద్రం. దీని కారణంగా బంగారం ధరలో గణనీయమైన తగ్గుదల కనిపించింది. ఆ సమయంలో బంగారం ధర 10 గ్రాములకు రూ.70,000 దిగువకు పడిపోయింది. కానీ ఇటీవలి కాలంలో భారతదేశం మళ్లీ తన బంగారం నిల్వను పెంచుతున్నట్లు ప్రకటించింది. దానితో బంగారం ధరలు పెరుగుతున్నాయి. గణేష్ చతుర్థితో దేశంలో పండుగల సీజన్ ప్రారంభమైంది. అలాగే పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుంది. అటువంటి పరిస్థితిలో దేశవ్యాప్తంగా ఆభరణాలకు డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా బంగారం ధర పెరుగుతుంది. ధన్‌తేరస్‌లో దేశంలో బంగారానికి డిమాండ్ ఏడాది పొడవునా ఎక్కువగానే ఉంది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం ధన్‌తేరస్‌లో బంగారం ధర కొత్త రికార్డును సృష్టించవచ్చు.

యుఎస్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించనుంది

అమెరికాలో పెరుగుతున్న మాంద్యం దృష్ట్యా, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ తన వడ్డీ రేట్లను తగ్గించవచ్చు. అమెరికాలో మాంద్యం ఏర్పడడానికి కారణం అక్కడ జరిగిన అధ్యక్ష ఎన్నికలే. ఇలాంటి సమయంలో వడ్డీరేట్లను తగ్గించాలని అమెరికా ప్రభుత్వంపై ఒత్తిడి వస్తోంది. వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయం రాగానే బంగారం ధర పెరుగుతుంది.

దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కూడా కారణం..

ప్రపంచంలో కష్టాల మేఘాలు కమ్ముకున్నప్పుడల్లా బంగారం ధర మరింత పెరుగుతుంది. ప్రస్తుతం ఇజ్రాయెల్–హమాస్, రష్యా–ఉక్రెయిన్ సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో యుద్ధం జరుగుతోంది. రానున్న కాలంలో పరిస్థితి మరింత దిగజారితే బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉంది. బంగారం కష్ట సమయాల్లో బీమా లాగా పనిచేస్తుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత కారణంగా ప్రపంచ సరఫరా చాలా వరకు ప్రభావితమైంది. దీని ప్రభావం ఆర్థిక మార్కెట్‌పై కూడా కనిపిస్తోంది. అటువంటి పరిస్థితిలో వారి నష్టాన్ని తగ్గించడానికి పెట్టుబడిదారులు బంగారంపై తమ పెట్టుబడిని పెంచుతారు. పెట్టుబడిదారులు సావరిన్ బ్యాక్డ్ గోల్డ్ సెక్యూరిటీల కంటే భౌతిక బంగారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. దీని కారణంగా బంగారం ధరలు పెరుగుతాయి.




# ‘మత్తువదలారా2’లో మాచో యాక్షన్ క్యారెక్టర్ చేశాను. డెఫినెట్ గా సినిమా అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది: హీరోయిన్ ఫరియా అబ్దుల్లా



బ్లాక్ బస్టర్ మత్తు వదలరాకు సీక్వెల్ గా ‘మత్తువదలారా2’ ప్రేక్షకులని అలరించడానికి సిద్ధమౌతోంది. శ్రీ సింహ కోడూరి లీడ్ రోల్ లో తన సైడ్ కిక్ గా సత్య నటిస్తున్న ఈ చిత్రానికి రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా నటిస్తోంది. ప్రతిష్టాత్మక బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

’మత్తువదలారా2’ ప్రాజెక్ట్ లో ఎలా వచ్చారు? కథ విన్నప్పుడు ఏం అనిపించింది ?

–’మత్తువదలారా2’ ఒక థ్రిల్లర్. యాక్టర్స్ ట్రాజెడీ నుంచి కామెడీ జనరేట్ అవుతుంది.(నవ్వుతూ). కథ చాలా నచ్చింది. విన్న వెంటనే ఇమ్మిడియట్ గా ఓకే చేసేశా. మత్తువదలారా పార్ట్ 1 బిగ్ హిట్. సెకండ్ పార్ట్, ఫస్ట్ పార్ట్ కి డిఫరెంట్ గా వుంటుంది. శ్రీసింహ, సత్య క్యారెక్టర్స్ డెలివరీ బాయ్స్ నుంచి స్పెషల్ గా ఏజెంట్ గా కనిపిస్తారు,

ఇందులో మీ క్యారెక్టర్ ఎలా వుంటుంది ?

–ఇందులో నా క్యారెక్టర్ పేరు సన్నిధి. తను కూడా ఒక స్పెషల్ ఏజెంట్. శ్రీసింహ, సత్య క్యారెక్టర్స్ పై సాఫ్ట్ కార్నర్ వుంటుంది. ఇందులో నా క్యారెక్టర్ యాక్షన్ వుంటుంది. మాచో రోల్. అది నాకు చాలా నచ్చింది. గన్స్ తో యాక్షన్ ప్లే చేయడం చాలా ఎంజాయ్ చేశా.

–ఈ సినిమాలో లిరిక్స్ రాయడంతో పాటు సాంగ్ పాడాను. డైరెక్టర్ రితేష్ కి ఈ ఆలోచన చెప్పినపుడు ఆయనకి చాలా నచ్చింది. అలాగే నా టీంతో సాంగ్ కొరియోగ్రఫీకూడా చేశాను.

శ్రీసింహ, సత్యలది సక్సెస్ ఫుల్ కాంబినేషన్ కదా.. ఆ కాంబోని మీరు ఎలా మ్యాచ్ చేశారు?

–నేను అందరితో కలసిపోతాను. వాళ్ళ హై ఎనర్జీ పెర్ఫార్మెన్స్ కి నా క్యారెక్టర్ బ్యాలెన్స్ చేస్తుంది. ఇందులో నా క్యారెక్టర్ కాస్త స్మార్ట్ గా వుంటుంది.

డైరెక్టర్ రితేష్ రానా గురించి ?

–రితేష్ రానా చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. చాలా క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చారు. ఆయన అంత ఫ్రీడమ్ ఇవ్వబట్టే సాంగ్ కొలాబరేషన్ సాధ్యపడింది. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని వుంది.

కల్కిలో రోల్ చేయడం ఎలా అనిపించింది?

–చాలా ఎక్సయిటింగ్ ఎక్స్ పీరియన్స్ అది. డైరెక్టర్ నాగ్ అశ్విన్ కి థాంక్ యూ. ప్రభాస్ గారితో బిగ్గర్ రోల్ వుండే సినిమా చేయాలని కోరుకుంటున్నాను.

శ్రీసింహ గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది ?

–శ్రీసింహ వెరీ ట్యాలెంటెడ్, స్వీట్. చాలా హార్డ్ వర్కింగ్ చేస్తారు. ఆయనతో మళ్ళీ కలసి పని చేయాలని వుంది.

సునీల్, వెన్నెల కిషోర్ పాత్రల గురించి ?

–వెన్నెల కిషోర్ గారితో జాతిరత్నాల నుంచి పరిచయం వుంది. సునీల్ గారు జెమ్. వారి పాత్రలు ప్రేక్షకులని చాలా ఎంటర్ టైన్ చేస్తాయి.

కాల భైరవ గారితో కలసి పని చేయడం ఎలా అనిపించింది?

– కాల భైరవ గారి మ్యూజిక్ సర్ ప్రైజింగ్ గా వుంటుంది. నా సాంగ్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళారు.

క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాతల గురించి?

–చాలా సపోర్ట్ చేశారు. చాలా కంఫర్ట్ బుల్ గా చూసుకున్నారు. వారితో పని చేయడం బ్యూటీఫుల్ ఎక్స్ పీరియన్స్. నాకు చిన్నప్పటి నుంచి రైటింగ్ పై ఆసక్తి వుంది. ఈ సినిమాలో పాట రాసిన అవకాశం కూడా ఇవ్వడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

’మత్తువదలారాకి పార్ట్ 2కి ఎలాంటి పోలికలు వుంటాయి?

–మత్తువదలారా ఫ్యాన్ బేస్ ఇందులో వుండే కంటెంట్ ని చాలా ఎంజాయ్ చేశారు. అలాగే స్టాండ్ లోన్ సినిమాగా కూడా ఈ మూవీ చాలా ఎంటర్టైన్ చేస్తుంది.

మీరు రియల్ లైఫ్ లో ఫన్నీ గా ఉంటారా ?

–నేను జనరల్లీ హ్యాపీ పర్సన్. నా చుట్టూ వుండే వాళ్ళు కూడా హ్యాపీగా వుండాలని చూస్తుంటాను. సరదాగా జోక్స్ చేస్తూవుంటాను.(నవ్వుతూ)

నెక్స్ట్ ప్రాజెక్ట్స్ గురించి


–తిరువీర్ తో ఓ లవ్ స్టొరీ చేస్తున్నాను. ఒక తమిళ్ మూవీ స్టార్ట్ కాబోతోంది.

# నేను చూసిన తొలి తెలుగు సినిమా ఆయనదే!



మలయాళ నటుడు టొవినో థామస్ విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటారు. ఆయా పాత్రల ద్వారా ఆయనకు చక్కని గుర్తింపు లభించింది. తాజాగా ఆయన నటించిన చిత్రం నటిస్తున్న 50వ చిత్రమిది. కృతి శెట్టి, ఐశ్వర్య రాజేష్ సురభి లక్ష్మి నాయికలుగా నటించారు. జితిన్ లాల్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ జకారియా థామస్‌తో కలిసి లిస్టిన్ స్టీఫెన్ నిర్మించారు. తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూటర్స్ గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు. సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో టొవినో థామస్ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. చిన్న ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టా. సపోర్టింగ్, కామెడీ, విలన్ పేరు తెస్తుందనే నమ్మకం ఉన్న ప్రతి పాత్ర చేశా. 2016 నుంచి లీడ్ రోల్స్ చేస్తున్నాను. యాక్టర్ కావాలనేది నా డ్రీం. ఇప్పుడా డ్రీంలో జీవిస్తున్నాను. ఆర్మ్ ప్రారంభించినప్పుడు ఇది నా 50వ చిత్రం అవుతుందని తెలీదు. చాలా ఎక్సయిటింగ్ స్క్రిప్ట్. మూడు డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయడం పెద్ద సవాల్‌గా అనిపించింది. డైరెక్టర్ నాపై నమ్మకం ఉంచారు. ఈ సినిమా కోసం వర్క్‌షాప్స్ చేశాం. మూడు పాత్రలు దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది. ఇందులో దొంగగా కనిపించే మణి పాత్ర కొంచెం ఎక్కువ ఇష్టం. ఆ పాత్రను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం ఆరు నెలల్లో కళరి విద్యను బాగా ప్రాక్టీస్ చేశా. దానిపై కొంత అవగాహన వచ్చింది. దర్శకుడు జతిన్‌తో ఎనిమిదేళ్ల జర్నీ నాది. నా కెరీర్‌లో 80శాతం సినిమాలు కొత్త దర్శకులతోనే చేశాను. పరస్పర నమ్మకంతోనే ఇది సాధ్యపడుతుంది. ఇందులో నాన్ లీనియర్ స్క్రీన్ ప్లే వుంటుంది. టైం పీరియడ్స్‌ని ఆడియన్స్ సులువుగా అర్థం చేసుకుంటారు. డైరెక్టర్ ప్రతి డిటెయిల్‌ని చాలా చక్కగా తెరకెక్కించారు. ఇక హీరోయిన్లు ముగ్గురు అద్భుతంగా నటించారు. ఈ సినిమాకి ఇమాజినరీ ఫిక్షనల్ వరల్డ్‌ని క్రియేట్ చేశాం. అందరినీ కథలో లీనం చేయడం కోసం త్రీడీ చాలా హెల్ప్ అవుతుంది. ఇంగ్లిష్, స్పానిస్ భాషల్లో కూడా విడుదల చేస్తున్నాం. యూనివర్శల్‌గా కనెక్ట్ అయ్యే ఈ సినిమాను దాదాపు ముప్పై భాషల్లో సబ్ టైటిల్స్‌తో విడుదల చేస్తున్నాం. ‘అజాయంతే రందం మోషణం’. అజయన్ రెండో దొంగతనం అని దీని అర్థం. మిగతా భాషల వారికి ఈ పేరు పలకడం కాస్త ఇబ్బందిగా వుంటుంది. అందకే అందరూ పలికే విధంగా ఈ టైటిల్ పెట్టాం. ్నడిగర్’ సినిమా కోసం మైత్రీ మూవీ మేకర్స్‌తో అసోషియేట్ అయ్యాను. వారుతో నాకు జర్నీ వుంది. మైత్రీ లాంటి టాప్ డిస్ట్రిబ్యూటర్స్ సినిమాని తెలుగులో రిలీజ్ చేయడం ఆనందంగా వుంది. ప్రతి సినిమాలో ఏదో ఒక కొత్తదనం వుండే కథ, పాత్ర చేయాలనే నా ప్రయత్నం. ఎక్స్ ప్లోర్ చేయాల్సింది చాలా ఉంది. సినిమా సినిమాకు ఏదో ఒక కొత్త అంశం నేర్చుకుంటూ ముందుకు వెళ్తున్నా. తెలుగు సినిమాలు బాగా చూస్తా. నేను చూసిన మొదటి సినిమా చిరంజీవి గారి ‘జగదేక వీరుడు అతిలోక సుందరి’ తెలుగు స్క్రిప్ట్ డిస్కర్షన్స్ జరుగుతుంటాయి. చూద్దాం ఏం జరుగుతుందో.

# విడాకులు కఠిన నిర్ణయమే..కానీ తొందర పడలేదు!



కోలీవుడ్ నటుడు జయం రవి విడాకులు తీసుకుంటున్నట్లు కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. భార్య ఆరతితో ధాంపత్య జీవితానికి స్వస్తి పలుకుతున్నట్లు నెట్టింట ప్రచారం ఒకానొక దశలో తారా స్థాయిలోనే జరిగింది. ఈ ప్రచారాన్ని జయం రవి కూడా ఖండించకపోవడంతో అంతా నిజమే అనుకున్నారు. అయితే తాజాగా ఈ ప్రచారాన్ని నిజం చేస్తూ జయం విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జయం రవి తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి పుకార్లు ఆరోపణలు చేయొద్దని జయం రవి కోరారు. దీనికి సంబంధించి ఓ లేఖ విడుదల చేసాడు. చాలా ఆలోచనలు ,చర్చల తర్వాత, ఆర్తితో నా వివాహాన్ని రద్దు చేసుకుంటున్నాను. ఇది కఠినమైన నిర్ణయమే. కానీ ఈ నిర్ణయం తొందరపాటుతో తీసుకోలేదు. ఎన్నో విషయాలు ఆలోచించి తీసుకున్న నిర్ణయం. ఇది వ్యక్తిగత కారణాల వల్ల వచ్చింది అని నేను నమ్ముతున్నాను. జీవితంలో ఓ కీలకమైన అధ్యాయాన్ని ముగించాను. నా అభిమానులు, మీడియా నుంచి సున్నితంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాను. మా నిర్ణయాన్ని అందరూ గౌరవిస్తారని ఆశిస్తున్నాను. దీనిపై ఊహాగానాలు, పుకార్లను , ప్రత్యేక కారణాలు పుట్టించొద్దు అని కోరుతున్నా%–% అన్నారు. జయం రవి, ఆర్తి 2009 జూన్ లో వివాహం చేసుకున్నారు. వీరికి ఆరవ్, అయాన్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అంటే 15 ఏళ్ల బంధానికి ఈ జోడీ స్వస్తి పలికింది. ఇద్దరు విడిపోతున్నట్లు ఈ ఏడాది జూన్ లో నెట్టింట ప్రచారంలోకి రావడం విశేషం. పెళ్లైన నెలలోనే విడిపోతున్నట్లు ప్రచారం జరగడం..ఇప్పుడు అది నిజమేనంటూ జయం రవి మీడియా ముందుకు రావడం అభిమానుల్ని తీవ్ర నిరాశకు గురి చేస్తోంది.

# మాల్దీవ్స్‌లో బికినీలో ఎవరీ లవ్‌లీ?



‘లవ్‌లీ’ చిత్రంతో తెలుగు వారికి పరిచయమైంది కన్నడ బ్యూటీ శాన్వి శ్రీవత్సవ. ఆది సాయికుమార్ హీరోగా దర్శకురాలు బి.జయ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. క్యూట్ లుక్స్ తో కుర్రకారు హృదయాలను మెలిపెట్టిన ఈ బ్యూటీ విష్ణు మంచు సరసన ఆర్జీవీ డైరెక్షన్ లో ఎటాక్ సినిమాలో నటించింది. గ్లామర్ ఎలివేషన్ పరంగా హద్దులు చెరిపేసి చెలరేగిపోయింది. అయినా ఇవేవీ కలిసి రాలేదు. శాన్వీ పూర్తిగా కన్నడ పరిశ్రమకే అంకితమైంది. బహుభాషా చిత్రం శ్రీమన్నారాయణలో రక్షిత్ శెట్టి సరసన నటించి మెప్పించింది. శాన్వి నటించిన మహా వీర్యార్ విడుదలై రెండేళ్లయింది. ఈ సందర్భంగా ఇటీవల సామాజిక మాధ్యమాల్లో సినిమా ఫోటోలను షేర్ చేసుకుని ఆనందం వ్యక్తం చేసింది. తాను ఇప్పటివరకూ చేసిన వాటిలో అత్యంత స్వచ్ఛమైన పాత్ర దేవయానిలో నటించానని వెల్లడించింది. ఇక దీంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఈ భామ నిరంతర ఫోటోషూట్లతో వేడెక్కిస్తూనే ఉంది. ఇప్పటికే ఇన్ స్టాలో లక్షలాదిగా ఫాలోవర్స్ ఉన్న ఈ బ్యూటీ..లేటెస్ట్ ఫోటోషూట్ తో మరోసారి కవ్వించింది. శాన్వి తాజా ఫోటోషూట్ అభిమానుల్లోకి వైరల్ గా దూసుకెళుతోంది. శాన్వి ప్రస్తుతం మాల్దీవుల విహారంలో ఎంజాయ్ చేస్తోంది. అక్కడ కొద్ది రోజులుగా విలాసాలను ఆస్వాధిస్తోంది. తాజాగా బికినీలో శాన్వి జిల్లనిపించింది. చిరుత తోలు బికినీలో శాన్వి అందచందాలు కుర్రకారు మతులు చెడగొడుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారాయి. శాన్వీ శ్రీవత్సవ ఇటీవల త్రిశూలం – బ్యాంగ్ అనే రెండు కన్నడ చిత్రాల్లో నటించింది. బ్యాంగ్ చిత్రం గత ఏడాది ఆగస్టులో విడుదలై మిశ్రమ స్పందనలు అందుకుంది. త్రిశూలం చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే శాన్వి మహావీర్యార్ చిత్రంతో మలయాళంలోను అడుగుపెట్టింది. తదుపరి ఓ వెబ్ సిరీస్ కోసం కథ వింటోందని తెలిసింది. కన్నడ సినిమా ఉగ్రం రీమేక్ తో మరాఠాలోకి ఈ భామ అడుగుపెడుతోంది. రాంతి అనేది అక్కడ టైటిల్.

# ఎర్ర కోకలో బజ్జీల పాప.. ఒక్కో సెల్ఫీ అదుర్స్ అంతే!



బజ్జీల పాప.. అదేనండీ తెలుగు అమ్మాయి కుషిత కల్లపు.. సోషల్ మీడియా ద్వారా ఫుల్ పాపులారిటీ సంపాదించుకున్న అమ్మడు.. ఆ క్రేజ్ తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. పలు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించిన కుషిత.. ఒక్క డ్రగ్స్ కేసుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అయిపోయింది. పబ్ కు వెళ్లింది.. డ్రగ్స్ తీసుకోవడానికి కాదు.. చీజ్ బజ్జీలు తినడానికి అని చెప్పింది. దీంతో బజ్జీల పాపగా ఆమె పేరు మారింది! ఆ తర్వాత ఇన్ స్టాగ్రామ్ ఇన్ఫ్లూయెన్సర్ గా సూపర్ క్రేజ్ సంపాదించుకుంది. అనేక షార్ట్ ఫిల్మ్ లో నటించింది. చాంగురే బంగారు రాజా, మనోహరం సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. గత ఏడాది నీతోనే నేను, అడ్డతీగల చిత్రాల్లో నటించింది. పెళ్లి కూతురు పార్టీ సినిమాలో మెరిసింది. రీసెంట్ గా బిగ్ బాస్ ఫేమ్ అర్జున్ కళ్యాణ్ తో కలిసి బాబు నెంబర్ 1 బుల్ షిట్ గాయ్ సినిమా చేసింది. కానీ అనుకున్న స్థాయిలో హిట్స్ సాధించలేకపోయింది. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం మూవీలో నటించే ఛాన్స్ అందుకుంది కుషిత. నాలుగు రోజులపాటు షూట్ కు వెళ్లింది. కానీ సినిమా రిలీజ్ అయ్యాక ఆమె కనిపించలేదు. ఈ విషయంపై ఆమెనే తర్వాత క్లారిటీ ఇచ్చింది. తాను చేసిన సీన్స్ ఎడిటింగ్ లో తొలగించినట్లు తెలుసుకున్నానని తెలిపింది. కాస్త బాధపడినా.. ఇలాంటివి కామన్ కదా అని చెప్పింది. ఇప్పుడు మంచి సినిమా అవకాశాలు అందుకోవాలని చూస్తోంది. అదే సమయంలో నెట్టింట తన అందచందాలతో ఆకట్టుకుంటోంది. ఎప్పటికప్పుడు చీరల్లో అందాలు ఆరబోస్తూ ఫిదా చేస్తుంటుంది. ప్లెయిన్ కలర్ శారీల్లో క్యూట్ గా కనిపిస్తూ ఫ్లాట్ చేస్తుంటుంది. జిమ్ చేస్తున్న పిక్స్ షేర్ చేస్తుంటుంది. మోడ్రన్ డ్రెస్సుల్లో కూడా ఫోటో షూట్ పోస్ట్ చేస్తూ మైమరపిస్తుంటుంది. అలా ఎప్పుడూ ట్రెండింగ్ లోనే ఉంటుంది. తాజాగా కొత్త పిక్స్ పోస్ట్ చేసింది. ట్రెడిషనల్ గా, హోమ్లీగా కుషిత కల్లపు సందడి చేసింది. రెడ్ కలర్ శారీలో సంప్రదాయంగా రెడీ అయ్యి వరుసగా తీసుకున్న సెల్ఫీలు షేర్ చేసింది. హెవీ నెక్ సెట్ వేసుకున్న అమ్మడు.. జడకు మల్లెపూలు పెట్టుకుంది. ఒక్కో సెల్ఫీలో ఒక్కో ఎక్స్ప్రెషన్ ఇస్తూ ఆకట్టుకుంటుంది. కొంటెగా.. ముద్దుగా.. క్యూట్ గా.. అమాయకంగా.. కామెడీగా.. కుషిత ఇచ్చిన పోజులు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. బజ్జీల పాప పిక్స్ అదిరిపోయాయని, ఫ్లాట్ అయ్యామని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు

# మేఘా ఆకాష్ అందం.. ఏంజెల్ కంటే ఎక్కువే..



మేఘా ఆకాష్ తన వ్యక్తిగత జీవితంలో ఓ కొత్త అడుగు వేయబోతోంది. చాలా.కాలంగా ప్రేమలో ఉన్న ఈ బ్యూటీ ఎప్పుడు కూడా ప్రేమ విషయాన్ని బయటకు లీక్ చేయలేదు. ఇక ఆమె ప్రియుడు సాయి విష్ణుతో నిశ్చితార్థం జరుపుకుంది. ఈ కార్యక్రమం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగింది. ఆ వేడుక తర్వాత అమ్మడు బ్యాచిలర్ పార్టీ కోసం శ్రీలంకకు వెళ్ళింది. మెఘా ట్రిప్‌కు సంబంధించిన అనేక ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ తన అభిమానులతో ఆనందాన్ని పంచుకుంటోంది. శ్రీలంకలోని ఆ అందమైన దీవిలో మెఘా చేస్తున్న సరదా ప్రయాణం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఆమె శ్రీలంకలోని అందమైన లొకేషన్స్ లో దిగిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. తాజాగా మెఘా ఆకాష్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలో, ఆమె ఒంటి మీద తెల్లని షోల్డర్ డ్రాప్ డ్రెస్ ధరించి ఎంతో అందంగా కనిపించింది. ఆ లుక్‌తో పాటు చేతిలో కోల్డ్ డ్రింక్, హెయిర్ స్టైల్‌కి చక్కగా సరిపోయే పూలతో మెఘా బ్రైడ్ మూడ్ లో ఉన్నట్లుగా కనిపిస్తుంది. మెరిసే చర్మం, గ్లామరస్ మేకప్ ఆమెకు మరింత అందాన్ని జోడించింది. ఈ ఫొటోలో మెఘా ఒక దేవతలా కనిపిస్తోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. మెఘా తన స్నేహితులతో కలిసి శ్రీలంకలో ఓ బ్యాచిలర్ పార్టీ కూడా ఎంజాయ్ చేసింది. ఆ ట్రిప్ లో కూడా చాలా సరదాగా గడిపిందని ఫొటోలు, వీడియోలు ద్వారా తెలియజేస్తోంది. ఇక మెఘా ఆకాష్ సినిమా కెరీర్ విషయానికి వస్తే.. తెలుగు ప్రేక్షకులకు “లై” మరియు “చల్ మోహన్ రంగ” వంటి చిత్రాల ద్వారా బాగా పరిచయం అయ్యింది. ఆమె తన నటనతోనే కాకుండా తన అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగుతున్న ఈ మార్పులు ఆమె అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి. ఇక పెళ్లి తరువాత అమ్మడు మళ్ళీ సినిమాల్లో నటిస్తుందో లేదో చూడాలి. ఆ మధ్య ఒక వెబ్ సీరీస్ తో బిజీగా ఉన్నట్లు చెప్పింది.

# అందరిని కాదని మహేష్ గౌడే ఎందుకు




హైదరాబాద్ :ఎట్టకేలకు తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడు నియమితులయ్యారు. పార్టీలో పలువురు సీనియర్లు పీసీసీ చీఫ్ పదవికి పోటీపడినా చివరికి మహేశ్‌కుమార్‌గౌడ్ వైపే కాంగ్రెస్ హౌకమాండ్ మొగ్గు చూపింది. బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడికి పార్టీ బాధ్యతలు అప్పగించడంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. కీలకమైన పీసీసీ అధ్యక్ష పదవీ బాధ్యతలు దక్కించుకోవడంలో మహేష్‌కు కలిసి వచ్చిన అంశాలేంటి?తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ నియమితులయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఆయనకు కాంగ్రెస్ హైకమాండ్ ప్రమోషన్ ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో విధేయతకే పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యమిచ్చి ఆయనను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. 2021 జులై నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం పీసీసీ బాధ్యతల నుంచి తప్పించింది.బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌కి పీసీసీ బాధ్యతలు అప్పగించడంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డిల అనంతరం 4వ పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో 2004 నుంచి 2014 మధ్యకాలంలో రెండు సార్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్ ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత అదే నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్టీపగ్గాలు అప్పగించడం విశేషం.గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయడానికి మహేశ్‌కుమార్‌గౌడ్ టికెట్ ఆశించారు. అయితే కొన్ని సమీకరణాల వల్ల దక్కలేదు. కేసీఆర్ పోటీలో ఉండటంతో రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయడంతో.. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆ స్థానం నుంచి తప్పుకొని నిజామాబాద్‌కు మారాల్సి వచ్చింది. దీంతో మహేశ్‌కుమార్ గౌడ్ అసెంబ్లీకి పోటీచేసే అవకాశం కోల్పోయారు. ఈ కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2024 జనవరిలో ఆయనను ఎమ్మెల్సీగా పార్టీ ఎంపిక చేసింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న మహేష్‌కు ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు ఆయనను పీసీసీ అధ్యక్షపీఠంపై కూర్చోబెట్టిందంటున్నారు. ఈ పదవి కోసం మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పలువురు పోటీపడ్డారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో.. పార్టీ- ప్రభుత్వం మధ్య సమన్వయం అవసరం. అందుకే రేవంత్‌రెడ్డి ఏరికోరి ఆయనకు పదవి ఇప్పించుకున్నట్లు చెప్తున్నారు.విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చి పార్టీనే అంటిపెట్టుకొని ఉండటం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమన్వయంతో పనిచేసుకుంటూ విధేయుడిగా ఉంటారనే పేరు పొందడం మహేష్‌కు కలిసి వచ్చింది ? ప్రస్తుత మంత్రివర్గంలో బీసీలకు కేవలం 2 మంత్రి పదవులు మాత్రమే ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణలో బలమైన వర్గంగా గుర్తింపు పొందిన గౌడ్ వర్గానికి పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతో అధిష్ఠానం మహేశ్‌కుమార్ గౌడ్ వైపు మొగ్గు చూపినట్లు రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.పీసీసీ చీఫ్ ఎంపిక అంకం ముగిసినందున.. రాష్ట్రంలో వరద పరిస్థితులు సద్దుమణిగి సాధారణ పరిస్థితులు నెలకొన్న అనంతరం మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చని కాంగ్రెస్ నాయకులు అంచనా వేస్తున్నారు. రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ కాంబినేషన్లో తెలంగాణలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.లోకల్ బాడీ సవాల్‌స్థానిక సంస్థల ఎన్నికలే తన ముందున్న అతిపెద్ద సవాల్ అంటూ కుండబద్దలు కొట్టేశారు మహేష్ కుమార్ గౌడ్. సూటిగా సుత్తి లేకుండా తన టార్గెట్ ఏంటో ఫిక్స్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డితో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడుతూ, అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికలే తన ముందున్న సవాల్ అని అన్నారు. తన పదవి కోసం పోటీ చేసిన వారితోనూ కలిసి ముందుకెళ్తానని, అందర్నీ సమన్వయం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లోనే టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకుంటానని, ప్రభుత్వానికి, పార్టీకి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. త్వరలోనే కమిటీలను నియమిస్తామని, ఖాళీగా ఉన్న పార్టీ పదవులను భర్తీ చేస్తామని చెప్పారు. గత పేదళ్లుగా పార్టీనే నమ్ముకున్న వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు మహేష్ కుమార్ గౌడ్.

# గర్వప్రదమైన మరియు గౌరవసంఘీభావ తీర్థయాత్ర: లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్‌లో పోలీసు అమరవీరులకు నివాళులర్పించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్



రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ శ్రీ మనోజ్ యాదవ్ నేతృత్వంలో 2024 సెప్టెంబర్ 3 న ఉదయం, వివిధ రాష్ట్రాల కు చెందిన పోలీస్ మరియు సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)కి ప్రాతినిధ్యం వహిస్తున్న 28 మంది సభ్యుల పోలీసు అధికారుల బృందం లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ మెమోరియల్ వద్ద సమావేశమైంది. ఈ బృందానికి డిప్యూటీ లీడర్‌గా తెలంగాణ పోలీస్ డిఐజి ఎన్. ప్రకాష్ రెడ్డి వ్యవహరించారు. సంఘీభావ ప్రదర్శనలో, ఐటిబిపి, ఐటిబిఎఫ్, మరియు అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో వాస్తవ ఆధిన రేఖ వద్ద జాగ్రత్తగా విధులు నిర్వర్తిస్తున్న ఇండియన్ ఆర్మీకి చెందిన అధికారులు మరియు సిబ్బంది కూడా పాల్గొన్నారు. 1959 అక్టోబర్ 21న చైనీస్ దళాలకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలిచిన పెట్రోలింగ్ పార్టీ సభ్యుడు, 86 ఏళ్ల అనుభవజ్ఞుడు స్వభాష : తెలుగు గౌరవ సోనమ్ దోర్జీని కలిసిన అరుదైన ఘనత కూడా ఈ పోలీసు ప్రతినిధి బృందానికి లభించింది. అయన దృఢత్వం మరియు ధైర్యం చరిత్రలో స్ఫూర్తిదాయకమైన అధ్యాయం. 15,400 అడుగుల ఎత్తులో, సముద్ర మట్టానికి దగ్గరలో ఉన్న ఈ ప్రాంతం, పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది చారిత్రాత్మక పరాక్రమానికి నిదర్శనం. అక్టోబర్ 21, 1959న తూర్పు లడఖ్‌లో జరిగిన ఈ సంఘటన జ్ఞాపకార్థం ఈ స్మారక చిహ్నం భారతీయ పోలీసు బలగాలకు పవిత్ర స్థలంగా నిలిచింది. 1960లో ప్రారంభమైన ఈ స్మారక వేడుక దేశవ్యాప్తంగా పోలీసు అధికారులకు గౌరవనీయ సంప్రదాయంగా నిలిచింది. ఈ సంవత్సరపు తీర్థయాత్ర ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది, ఎందుకంటే శ్రీ మనోజ్ యాదవ్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్ .పి .ఎఫ్ )డైరెక్టర్ జనరల్‌గా బృందానికి నేతృత్వం వహించిన మొదటి వ్యక్తి అయ్యారు. వివిధ బలగాల పోలీసు అధికారులతో కలిసి ఆయన పాల్గొనడం, భారతదేశంలోని వివిధ పోలీసు బలగాల మధ్య ఐక్యత, బలం మరియు స్నేహాన్ని బలపరుస్తుంది. 1958లో ఆర్‌పిఎఫ్ ప్రారంభమైనప్పటి నుండి విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన 1011 మంది ధైర్యవంతులైన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందికి ఈ తీర్థయాత్రను అంకితం చేస్తూ, డీజీ ఆర్‌పిఎఫ్ 1959లో అమరులైన వీరుల చూపిన విధి, శౌర్యం మరియు త్యాగం యొక్క స్ఫూర్తిని ఆర్‌పిఎఫ్ ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని పునరుద్ఘాటించారు. శ్రీ మనోజ్ యాదవ్ ఈ గంభీరమైన కార్యక్రమంలో పాల్గొనడం, చట్టాన్ని అమలు చేసే సంఘంలోని సభ్యులందరికీ స్ఫూర్తినిచ్చే సంఘటనగా నిలిచింది. ఇది దేశ సేవలో పోలీసు అధికారులు చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ, భారతీయ పోలీసు సోదరత్వాన్ని నిర్వచించే కర్తవ్యం, శౌర్యం మరియు నిబద్ధత యొక్క శాశ్వత స్ఫూర్తిని మరింత బలపరుస్తుందని తెలిపారు

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



పెద్దపల్లి, సెప్టెంబర్-9: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి వారి దేవాలయ విస్తరణ పనులకు శ్రీకారం



వేములవాడ సెప్టెంబర్ 9 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : రాజన్న ఆలయ విస్తరణకు శృంగేరి పీఠం శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతి తీర్థ మహా స్వాముల వారు,పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధిశేఖర భారతి స్వాముల వారి ఆజ్ఞను కోరిన ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సీఎంవో ఓఎస్డి శ్రీనివాసులు,ఆలయ అధికారులు బృందం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో శృంగేరి వెళ్లిన ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, సీఎంవో ఓఎస్డి శ్రీనివాస్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, ఆలయ అధికారుల, అర్చకుల బృందం రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ ఆలయం, దక్షిణ కాశీగా పేరుగాంచిన, కోరిన కోర్కెలు తీర్చే శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తులకు స్వామివారి దర్శనం వేగంగా కల్పించేందుకు, ఆలయ విస్తరణ పనులను ప్రారంభించడానికి శృంగేరి పీఠం వారి అనుమతులకై సిఎం ఆదేశాల మేరకు, శృంగేరి పీఠం సందర్శించారు. రెండు నెలల క్రితం ప్రభుత్వ విప్ శృంగేరి పీఠన్ని సందర్శించి ఆలయ విస్తరణ పై చర్చించినపుడు ఆలయా నమూనా తో రావాలని శృంగేరి పీఠాధిపతి తెలుపగా ప్రభుత్వ విప్ బృందం శృంగేరి పీఠం శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతి తీర్థ మహా స్వాముల వారికి,పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారిని కలిసి వారికి ఆలయ విస్తారణ నమూనాలను చూపెట్టి వారి సూచనలు సలహాల అనుగుణంగా ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టడం కోసం ఆజ్ఞను కోరారు. శృంగేరి పీఠం శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతి తీర్థ మహా స్వాముల వారు,పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారు పలు సందేహాలకు తగు సూచనలు సలహాలను ఇస్తూ, శుభమని తెలియజేస్తూ ఆలయ విస్తరణకు ముందుకు వెళ్లాలని మౌఖికంగా ఆదేశాలించారు.. త్వరలోనే శ్రీశ్రీశ్రీ జగద్గురులు శ్రీ రాజరాజశ్వర ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ఆలయంలోని ఇతరత్ర అభివృద్ధి పనులకు అక్కడికక్కడే తగు సూచనలు సలహాలు ఇస్తానని పేర్కొన్నారు. శృంగేరి శ్రీశ్రీశ్రీ జగద్గురులు భారతి తీర్థ స్వామి వారిని శ్రీ రాజరాజశ్వర వారి ఆలయానికి రావలసిందిగా విజ్ఞప్తి చేశారు...

# క్లౌడ్ బరస్ట్ వల్ల విపరీతమైన వర్షాలు




న్యూఢిల్లీ, :ఈ స్థాయిలో వానలు కురుస్తున్నాయి. ఇలాంటి దుస్థితి నేను ఎప్పుడూ చూడలేదు.. గుజరాత్ రాష్ట్రాన్ని చాలా ఏళ్లుగా పరిపాలించా. ఎన్నో ప్రకృతి విపత్తులను చవి చూశా. కానీ ఇప్పుడు కురుస్తున్న వర్షం, పోటెత్తుతున్న వరద ఎప్పుడో చూడలేదు. గుజరాత్ మాత్రమే కాదు, దేశం మొత్తం జల ప్రళయం కనిపిస్తోందని" స్వయంగా నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల వర్షాలకు తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలు నీట మునిగాయి. గంటల వ్యవధిలోనే 30+ సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షం వల్ల వరద తాకిడి పెరిగిపోవడంతో జాతీయ రహదారులు కొట్టుకుపోయాయి. వంతెనలు నామరూపాలు లేకుండా పోయాయి. పంట పొలాలు ఇసుక మేటలు వేసాయి. గ్రామాలకు గ్రామాలు బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ఇప్పటికీ చాలా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. గత ఏడాది క్లౌడ్ బరస్ట్ వల్ల విపరీతమైన వర్షాలు కురిసాయి. కొన్ని ప్రాంతాలలో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురవలేదు.ఈసారి ఎల్ నినో ప్రభావం పూర్తిగా లేదు. అయితే గతానికంటే భిన్నంగా అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.. అయితే ఈ వర్షాలు అన్నిచోట్ల పడితే పెద్దగా సమస్య ఉండేది కాదు. అయితే వర్షం ఒక్క చోట మాత్రమే కుండ పోతగా కురవడం వల్ల ఇబ్బంది ఎదురవుతోంది. దీనిని వాతావరణ నిపుణులు క్లౌడ్ బరస్ట్ అని పిలుస్తున్నారు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మేడారం ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ అవ్వడం వల్ల కొన్ని వేల ఎకరాల్లో అడవి నాశనమైంది. చెట్లు మొత్తం విరిగిపోయాయి.. కృష్ణాజిల్లాలో విజయవాడ నగరం మొత్తం నీట మునిగిపోయింది.. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం, విజయవాడ, వరంగల్ మాత్రమే కాదు.. దేవభూమి ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాలలో క్లౌడ్ బరస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి.. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో జలవిలయం చోటు చేసుకోవడానికి కూడా క్లౌడ్ బరస్ట్ కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.మనదేశంలోనే కాదు చైనాలోనూ క్లౌడ్ బరస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ యాగి తుఫాను పెను విధ్వంసం సృష్టిస్తోంది. వరదలు చుట్టుముట్టడంతో చైనా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అక్కడిదాకా ఎందుకు పూర్తి ఎడారి ప్రాంతమైన దుబాయ్ లోనూ విపరీతమైన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతాన్ని వరదలు వణికిస్తున్నాయి.. ఇక బంగ్లాదేశ్ లోనూ తుఫాన్ అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఇలా ప్రపంచం నలుమూలల ఏదో ఒకచోట ప్రకృతి విపత్తు చోటు చేసుకుంటూనే ఉంది. అంటే అమెరికా నుంచి మొదలు పెడితే ఆఫ్గనిస్తాన్ వరకు క్లౌడ్ బరస్ట్ విపత్తు అనేది ఉంది.. ప్రకృతిపై మనిషి చేస్తున్న పెత్తనం వల్ల ఇలాంటి ఇలాంటి విపత్తులు చోటుచేసుకుంటున్నాయి.వాతావరణ మార్పుల వల్ల మేఘాలు ఏర్పడటం.. అవి బద్దలైపోయి విస్తారంగా వర్షం కురవడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు మేఘాలు అంతటా విస్తరించి వర్షాలు కురిసేవి. కానీ ఇప్పుడు మేఘాల గమనంలో కూడా మార్పు వస్తోంది. ఒకే చోట కుండపోత గా వర్షాలు కురుస్తున్నాయి. భూ ఉపరితలం వేడెక్కడం.. సముద్ర ఉపరితల వేడెక్కడం.. మేఘాలు భారీగా సముద్రపు నీటిని తీసుకొని అంతే స్థాయిలో ఒకే చోట వర్షాలు కురిపించడం వంటి పరిణామాల వల్ల ఇంతటి విపత్తులు చోటు చేసుకుంటున్నాయని వాతావరణ నిపుణులు అంటున్నారు. గత ఏడాది జూలై నెలలో క్లౌడ్ బరస్ట్ అయింది. ఆ సమయంలో దానిని విదేశీ కుట్ర అని నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు.. అందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు గాని.. ప్రస్తుతం మనిషి చేస్తున్న పనుల వల్ల ప్రకృతి ఆగ్రహిస్తోందనేది మాత్రం నూటికి నూరుపాళ్ళు కఠిన వాస్తవం.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని వద్ద అన్నదానం



వేములవాడ సెప్టెంబర్ 9 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ లో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న గణనాథుని ప్రతిష్టించి నవరాత్రులు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచి ఘనంగా నిమజ్జనం చేస్తూ వస్తున్నారు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు. ఇందులో భాగంగానే సోమవారం పార్టీ సీనియర్ నాయకులు వాసాల శ్రీనివాస్ అన్నదానం చేయగా, ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గారి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో గణనాథుని ప్రతిష్టించి నవరాత్రులు పూజ చేస్తున్న పార్టీ నాయకులను ఆయన అభినందించారు. అనంతరం నిరుపేదలకు ఆయన చేతుల మీదుగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, పట్టణ కౌన్సిలర్లు మారం కుమార్, సిరిగిరి చందు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, ప్రసాద్ రావు, నరాల దేవేందర్,నీలం శేఖర్, ముద్రకోల వెంకటేశం,ప్రేమ్ చారీ, కమలాకర్ రెడ్డి, మైలారం రాము,పర్వేజ్, అంజాద్ పాషా, కృపాల్,లిక్కడి మహేందర్,రవిచంద్ర గౌడ్,నీరటి మల్లేశం, దేవరాజు,చెన్నమనేని స్వయం ప్రభ, చీటీ సంధ్య రాణి,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం



వేములవాడ సిరిసిల్ల సెప్టెంబర్ 9 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారంఉదయం10:00 గంటల నుండి 03:00 గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు.గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ గారు తెలిపారు.

# కాళోజీ నారాయణరావు సేవలు మరువలేనివి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 9 : కవి కాళోజీ నారాయణరావు సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్‌హా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కాళోజీ చిత్ర పటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్, డీవైఎస్ఓ రాములు, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.